# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 213 | హైదరాబాద్ | శనివారం 14-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




మోదీ రాజకీయ భవిష్యత్తుపై ట్రంప్ వీడియో.. స్పందించిన భారత్

11లో

## ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

- హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం
- ఒకేరోజు రూ.34 కోట్ల విలువైన 3041 గజాల భూముల స్వాధీనం
- భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులు, గుడిమల్కాపూర్‌లో ఒక పార్కుకు విముక్తి
- హైడ్రా చర్యలతో స్థానికుల సంబరాలు, భారీ ర్యాలీలు
- ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో వేగంగా స్పందన



11లో

బంగ్లాదేశ్ ఎన్నికల్లో

## బీఎన్‌పీ ఘన విజయం..

తారిక్ రహ్మాన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు



11లో

- బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం
- పార్టీ అధినేత తారిక్ రహ్మాన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు
- ప్రజాస్వామ్య బంగ్లాదేశ్‌కు భారత మద్దతు కొనసాగుతుందని హామీ
- 17 ఏళ్ల ప్రవాసం తర్వాత తిరిగొచ్చి అధికారం చేపట్టనున్న తారిక్
- అధికారికంగా ఫలితాలు ప్రకటించాల్సి ఉన్న ఎన్నికల సంఘం





11లో

హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్...

## లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

- అక్రమ సరోగసీ కేసులో డాక్టర్ నమ్రతను అరెస్ట్ చేసిన ఈడీ
- సంతానం లేని దంపతులకు శిశువులను అక్రమంగా అమ్మకాలు
- మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు
- ఫిబ్రవరి 26 వరకు నిందితురాలికి జ్యుడీషియల్ రిమాండ్
- గతంలోనూ పలు కేసుల్లో అరెస్టయిన డాక్టర్ నమ్రత

బలపడిన భారత పాస్‌పోర్ట్..

## 75వ స్థానానికి జంప్

- హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో 75వ స్థానానికి చేరిన భారత్
- గతేడాది 85వ ర్యాంకు నుంచి 10 స్థానాలు మెరుగుదల
- భారత పాస్‌పోర్ట్‌తో 56 దేశాలకు వీసా రహిత ప్రయాణం
- జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన సింగపూర్ పాస్‌పోర్ట్

11లో





## ఎంపీపై అనర్హత వేటు ప్రొసీజర్ ఇదే!



11లో

- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దుకు బీజేపీ ఎంపీ నోటీసు
- లోక్ సభ సభ్యుడిపై అనర్హత వేటు ప్రక్రియపై చర్చ
- ఎథిక్స్ కమిటీ సూచనలకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం

వరల్డ్ రేడియో డే... డిజిటల్ యుగంలోనూ

## ఉనికిని చాటుకుంటున్న రేడియో

- ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'తో పెరిగిన ఆదరణ
- గ్రామీణ ప్రాంతాల్లో సమాచారానికి కీలక సాధనం
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రపంచం



11లో



11లో

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను

## మెరుగుపరుస్తాం: నారా లోకేశ్

- 40 శాతం పాఠశాలలు 2 స్టార్ కంటే తక్కువగా ఉన్నాయన్న మంత్రి
- నాడు-నేడుపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదని ప్రశ్న
- ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామన్న మంత్రి

## 'సాక్షి' కథనంపై హెరిటేజ్ ఫుడ్స్ ఫైర్... ప్రకటన విడుదల

- తమపై సాక్షి పత్రికలో వచ్చిన కథనాన్ని తీవ్రంగా ఖండించిన హెరిటేజ్ ఫుడ్స్
- టీటీడీకి నెయ్యి సరఫరా చేశామన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టీకరణ
- ఇందుపూర్ డైరీతో నెయ్యి తయారీకి ఎలాంటి ఒప్పందం లేదని వెల్లడి
- ఇది రాజకీయ ప్రేరేపిత దుష్ప్రచారమని, సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర అని ఆరోపణ
- వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఈ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ప్రకటన





11లో

నల్లమలసాగర్‌పై... తెలంగాణ

## అభ్యంతరం చెప్పడం తగదు

- నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం సరికాదన్న సీఎం చంద్రబాబు
- 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం
- ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్
- విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ

11లో



## ఇండియాలో రైట్ టు రీ కాల్ సాధ్యమేనా

ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా పార్లమెంటులో రైట్ టు రీకాల్ ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టారు. ఇది భారత రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఎన్నికైన ప్రతినిధి తన విధుల్లో విఫలమైతే లేదా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేస్తే, పదవీకాలం ముగియక ముందే వారిని వెనక్కి పిలిచే అధికారం ఉండాని ఈ బిల్లు పెట్టారు. ఈ అధికారం ప్రజాస్వామ్యానికి నిజంగా మేలు చేస్తుందా? లేదా అస్థిరతకు దారితీస్తుందా?భారత ప్రజాస్వామ్యంలో ఓటరుకు ఐదేళ్లకోసారి మాత్రమే తన తీర్పును తెలిపే అవకాశం ఉంటుంది. పార్లమెంటులో ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా 'రైట్ టు రీకాల్' అంశాన్ని లేవనెత్తారు. పనితీరు బాలేని ప్రజాప్రతినిధులను ఐదేళ్ల పాటు భరించాల్సిన అవసరం లేదని, వారిని మధ్యలోనే తొలగించే అధికారం ఓటర్లకు ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా, స్విట్జర్లాండ్ సహా ప్రపంచంలోని 24 దేశాల్లో రైట్ టు రీకాల్ అమలులో ఉందని గుర్తుచేశారు. భారతదేశంలో కూడా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలంటే ఈ విధానం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ గ్యాప్‌లో ఎన్నికైన ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో లేకపోయినా, అవినీతికి పాల్పడినా ఓటరు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటారు. రాఘవ్ చద్దా వాదన ప్రకారం, రైట్ టు రీకాల్ అమలులోకి వస్తే ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రజల పట్ల నిర్లక్ష్యంగా ఉండేవారికి ఇది ఒక హెచ్చరికగా మారుతుంది. ఇది ఓటరును కేవలం ఐదేళ్లకోసారి ఓటు వేసే యంత్రంగా కాకుండా, నిరంతరం పర్యవేక్షించే శక్తిగా మారుస్తుంది.సిద్ధాంతపరంగా ఇది అద్భుతంగా అనిపించినప్పటికీ, క్షేత్రస్థాయిలో దీని అమలు అనేక సవాళ్లతో కూడుకున్నది. భారత్ వంటి బహుళ పార్టీలు, తీవ్రమైన రాజకీయ వైషమ్యాలు ఉన్న దేశంలో ఈ చట్టం రాజకీయ కక్షసాధింపున కు ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. ఓడిపోయిన అభ్యర్థులు లేదా ప్రత్యర్థి పార్టీలు నిరంతరం రీకాల్ పిటిషన్లతో పాలనను స్తంభింపజేసే అవకాశం ఉంది. ఇది దేశంలో నిరంతరం ఎన్నికల వాతావరణాన్ని సృష్టించి, అభివృద్ధి పనులను పక్కదారి పట్టించవచ్చు. అలాగే, ఒక ఎన్నిక నిర్వహణకు అయ్యే భారీ ఖర్చును దేశ ఆర్థిక వ్యవస్థ పదే పదే భరించడం కష్టసాధ్యం.అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు, స్విట్జర్లాండ్, కెనడా వంటి దేశాల్లో ఈ విధానం పాక్షికంగా అమల్లో ఉంది. జయప్రకాష్ నారాయణ్ వంటి వారు గతంలోనే దీని గురించి గళమెత్తారు. అయితే, పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఈ విధానాన్ని తీసుకురావాలంటే ఓటరు చైతన్యం చాలా అవసరం.మరో వైపు 10 మార్చి 2017న ఎంపీ వరుణ్ గాంధీ, ఎన్నికైన ఎంపీల, ఎమ్మెల్యేల పనితీరు సంతృప్తికరంగా లేకపోతే, ప్రజలు ఆ ప్రజాప్రతినిధులను పదవి నుంచి తొలగించేలా చట్టం చేసేందుకు 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలో సవరణను ప్రతిపాదిస్తూ లోక్‌సభలో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు.ఈ ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రకారం, ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఓటు వేసిన వారిలో 75% మంది వారి పనితీరు పట్ల సంతృప్తి చెందకపోతే, ఎన్నికైన రెండేళ్లలోపు వారిని రీకాల్ చేయవచ్చు. ఇందుకోసం ఎన్నికల తర్వాత కనీసం రెండు సంవత్సరాల వ్యవధి తర్వాత నియోజకవర్గంలోని ఏ ఓటరు అయినా స్పీకర్ ముందు పిటిషన్ దాఖలు చేయడం ద్వారా రీకాల్ ప్రక్రియను ప్రారంభించవచ్చు. ఈ రీకాల్ పిటిషన్ పై ఆ నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో కనీసం నాలుగో వంతు మంది సంతకం చేయాలి. స్పీకర్ పిటిషన్ యొక్క ప్రామాణికతను పరిశీలించిన తర్వాత, ఓటర్ల సంతకాలను ధృవీకరించడానికి స్పీకర్ దానిని ఈసీఐకి బదిలీ చేస్తాడు. స్పీకర్ నుండి రీకాల్ పిటిషన్ అందిన తర్వాత, ఎన్నికల కమిషన్, రీకాల్ పిటిషన్‌పై సంతకాల ప్రామాణికతను కోసం ధృవీకరణ ప్రక్రియను ప్రారంభించి, దీనిని ఒక నిర్దిష్ట వ్యవధిలోపు పూర్తి చేయాలి. అనంతరం రీకాల్ ప్రక్రియను నిర్వహిస్తుంది. దీనికోసం ఎంపీ లేదా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పది ప్రాంతాల్లో రీకాల్ పిటిషన్‌పై ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలి. రీకాల్ పిటిషన్‌కు అనుకూలంగా సదరు ప్రజాప్రతినిధి ఎన్నికల్లో పొందిన ఓట్లలో కనీసం 3/4 వంతు ఓట్లు వస్తే రీకాల్ పిటిషన్ విజయవంతమైందని భావిస్తారు అంటే సదరు ప్రజాప్రతినిధిని పదవి నుండి తొలగిస్తారు, ఆ తర్వాత ఈసీఐ ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నికను నిర్వహించాలి. కుల, మత సమీకరణాలతో ఓట్లు పడే మన దగ్గర, రీకాల్ ప్రక్రియ కూడా కుల రాజకీయాల చుట్టూ తిరిగే ప్రమాదం లేకపోలేదు.రాఘవ్ చద్దా డిమాండ్ చేస్తున్న ఈ హక్కు ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేసే అవకాశం ఉన్నప్పటికీ, దీనికి కఠినమైన నిబంధనలు ఉండాలి. ఉదాహరణకు, కనీసం మూడేళ్ల పదవీకాలం ముగిసిన తర్వాతే రీకాల్‌కు అనుమతించడం, మెజారిటీ ఓటర్లు సంతకాలు చేస్తేనే ప్రక్రియ మొదలుపెట్టడం వంటి రక్షణ కవచాలు ఉండాలి. రైట్ టు రీకాల్ అనేది ప్రజాస్వామ్య పరిణామ క్రమంలో ఒక గొప్ప అడుగు కావచ్చు, కానీ అది అరాచక రాజకీయాలకు దారి తీయకుండా చూడటం చట్టసభల బాధ్యత. ప్రస్తుతం ప్రైవేటు మెంబర్ బిల్లు వలన.. ప్రజల్లో చర్చ జరుగుతోంది. ఇది ఒకందుకు మంచిదే.ప్రైవేట్ మెంబర్ బిల్లులు చాలా అరుదుగా చట్టాలుగా మారతాయి. సుమారు గత 45 ఏళ్లలో, ఒక్క ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా పార్లమెంటులో ఆమోదం పొందలేదు. పార్లమెంటు ఆమోదించిన చివరి ప్రైవేట్ మెంబర్ బిల్లు సుప్రీంకోర్టు (క్రిమినల్ అప్పీలేట్ అధికార పరిధి విస్తరణ) బిల్లు, 1968. ఇది 09 ఆగస్టు 1970న చట్టంగా మారింది. 1952 నుండి ఇప్పటివరకు కేవలం 14 ప్రైవేట్ మెంబర్ బిల్లులు మాత్రమే చట్టాలుగా మారాయి. పార్లమెంటులో ఆమోదం పొందిన ప్రైవేట్ మెంబర్ బిల్లులకు సంబంధించిన మరింత సమాచారం కోసం ఇక్కడ ఒ ఇక్కడ చూడండి.చివరగా, 'రైట్ టు రీకాల్' బిల్లును మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని ఎలాంటి విశ్వసనీయ రిపోర్ట్స్ లేవు.

# ఉదయం సీబీఎస్... రాత్రి లోకేష్..

## ఎమ్మెల్యేలతో వరుస భేటీలు

విజయవాడ, ఫిబ్రవరి 13,

పవర్‌లోకి వచ్చి ఆల్రెడీ ఇరవై నెలలు అవుతుంది. ఇప్పటిదాకా అభివృద్ధి, సంక్షేమంపైనే ఫుల్ ఫోకస్ నడిచింది. త్వరలోనే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎలక్షన్స్ రాబోతున్నాయ్. ఇప్పుడు పార్టీపై కాన్సన్‌ట్రేషన్ షిఫ్ట్ చేశారు సీఎం చంద్రబాబు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలే అపాయింట్‌మెంట్ కోరి తమను కలవాలనుకునే బదులు.. చంద్రబాబే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్సీలతో భేటీ అవుతున్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఎలాంటి ఒపీనియన్ ఉంది.? స్థానికంగా ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేశారా.? మీకేం కావాలి.? పార్టీ పరంగా ఏం చేయాలి.? ప్రభుత్వ పరంగా చేసి పెట్టాల్సిన పనులు ఏంటి.? మీ వ్యక్తిగత సమస్యలు ఏమైనా ఉన్నాయా.? అంటూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ముఖాముఖి నిర్వహిస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు..తప్పులు సరిదిద్దుకునేందుకు అవకాశం ఇవ్వలేదనే విమర్శలు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునే పనిలో పడ్డారట. అసలే అసెంబ్లీ బడ్జెట్ సెషన్ నడుస్తుంది.ఎమ్మెల్యేలంతా 9 గంటల వరకు సభలో ఉండాలని ఇప్పటికే బాబు ఆదేశించారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా బడ్జెట్ సమావేశాలు అయిపోయే వరకు విజయవాడలోనే ఉండే అవకాశం ఉంది. దీంతో ఇదే సమయంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో వరుసగా భేటీ అవుతూ..ఎక్కడిక్కడ సమస్యలకు చెక్ పెట్టి.. అంతా సెట్ చేసే ప్లాన్ చేస్తున్నారట.అటు మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతిరోజూ ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో డిన్నర్ మీట్ అవుతున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యే వరకూ ఈ భేటీలు జరగనున్నాయి. రోజూ ఒక్కో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబసభ్యులతో నారా లోకేశ్ డిన్నర్ భేటీలు కంటిన్యూ కాబోతున్నాయి. నారా లోకేష్‌తో జరిగే ఈ డిన్నర్ మీట్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటుగా వారి కుటుంబసభ్యులు కూడా హాజరవుతున్నారు.ఈ విందు సమావేశాల్లో నియోజకవర్గాల్లోని సమస్యలపై చర్చించడంతో పాటు..ఎమ్మెల్యేలతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని నారా లోకేశ్ భావిస్తున్నారు. ఇలా అటు సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులకు డైరెక్షన్స్ ఇస్తూ..ఫ్యూచర్ పాలిటిక్స్‌పై దిశానిర్దేశం చేస్తున్నారట. లోకేశ్ అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బాండింగ్ పెంచుకునేలా..కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా చేస్తుంటే..ఎక్కడా అసంతృప్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారట.ప్రభుత్వ హయాంలో సీఎం అపాయింట్మెంట్ దొరకడం లేదంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా గగ్గోలు పెట్టినట్లు కథనాలొచ్చాయి. పైగా తమ హయాంలో సీఎంవో నడపాల్సినంత గొప్పగా నడపలేకపోయామని వైసీపీ నేతలే చెప్తుంటారు. కడుపు చించుకుంటే కాళ్ల మీద పడుతుందనే ఆవేదనతో కొంతమంది ఎమ్మెల్యేలు కక్కలేక, మింగలేక మిన్నకుండిపోయి ఎన్నికల తర్వాత బరస్ట్ అయిపోయారు.మరికొందరు అయితే ముందు నుంచే ఆఫ్ ది రికార్డ్‌లో తమ ఆగ్రహాన్ని, ఫ్రస్ట్రేషన్‌ను వెళ్లగక్కిన సందర్భాలున్నాయి. అయితే తమ పార్టీలో, ప్రభుత్వంలో పరిస్థితికి తావు లేకుండా అటు సీఎం చంద్రబాబు, ఇటు మంత్రి లోకేశ్ సరికొత్త ఆలోచన చేశారని తెలుస్తోంది. తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో అయినా పూర్తిగా కొన్ని గంటలు వ్యక్తిగతంగా, మరికొంత సమయం వారి కుటుంబ సభ్యులతోనూ కలిసినట్లు ఉండటంతో పాటు.. వారి నియోజకవర్గాల్లో సమస్యలు, పార్టీ పరిస్థితి, ప్రజల అభిప్రాయాలను లోతుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారట.ఈ అసెంబ్లీ సెషన్ పూర్తయ్యేలోపు డిన్నర్ విత్ లోకేశ్ కార్యక్రమం వైరల్‌గా మారే ఛాన్స్ ఉంది. అలా అని లోకేశ్ ప్రత్యేకత ఈ ఒక్క కార్యక్రమానికే పరిమితం కాదని..మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి "ఎక్స్" వేదికగా తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపైనా వెంటనే స్పందిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.ఎక్స్‌లో తన దృష్టికి వచ్చిన సమస్యను..తన ఆఫీస్ టీమ్‌కు అసైన్ చేస్తున్నారు.. వారు ఫాలో అప్ చేసి, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని, సమస్యను సాల్వ్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు డిన్నర్ మీట్‌తో నేరుగా సమావేశం అయి..గ్రూప్‌వార్..కమ్యూనికేషన్ గ్యాప్‌కు చెక్ పెట్టి..అక్కడక్కడ ఏమైనా అసంతృప్తులు, అలకలు ఉన్నా అంతా సెట్‌రైట్ చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలుగు తమ్ముళ్లు చర్చించుకుంటున్నారు.

టార్గెట్ 2029

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూటమి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నారా లోకేశ్ ప్రజా దర్బార్ ను ఉండవల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి అనేక మంది ఈ ప్రజాదర్బార్ కు హాజరవుతూ వినతులను అందచేస్తున్నారు. వంద శాతం ఈ సమస్యలను పరిష్కరించకపోయినప్పటికీ దాదాపు ఎనభై శాతం సమస్యలు పరిష్కారమవుతున్నాయి. లోకేశ్ ప్రజాదర్బార్ కు వెళితే తమ సమస్యలను పరిష్కారం అవుతాయని భావించి అన్ని నియోజకవర్గాల నుంచి ఎక్కువ మంది ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు.ఇక తాజాగా నారా లోకేశ్ మరొక కొత్త సంప్రదాయానికి మంత్రి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులతో సమావేశం కావాలని




నిర్ణయించుకున్నారు. ఒక్కోరోజు ఒక్కో పార్లమెంటు నియోజకర్గ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలకు కుటుంబ సమేతంగా నారా లోకేశ్ డిన్నర్ సమావేశాన్ని నిర్వహించనున్నారు.ఎమ్మెల్యేలతో పాటు వారి కుటుంబ సభ్యులను కలుసుకుని వారి సమస్యలను గురించి నారా లోకేశ్ తెలుసుకోనున్నారు. పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ఆయన చర్చించనున్నారు. ఈరోజు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన టీడీపీ ఎమ్మెల్యేలతో సమావేశం కానున్నారు. వారి సమస్యలను వినడంతో పాటు వారితో ఫొటోలు దిగి వారితో కాసేపు గడపనున్నారు.ఇక కార్యకర్తల సమావేశాలను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉన్న టీడీపీ కార్యకర్తలను ప్రోత్సహిస్తూ వారికి గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించారు. దీనివల్ల టీడీపీ సోషల్ మీడియా మరింత యాక్టివ్ అవుతుందనే ఈ నిర్ణయం తీసుకున్నారు. అధికారంలో లేనప్పుడు యాక్టివ్ గా సోషల్ మీడియాలో ఉండే కార్యకర్తలు అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు దక్కలేదని, మరికొన్ని కారణాలతో వారు యాక్టివ్ గా లేకపోవడాన్ని గుర్తించిన నారా లోకేశ్ వారిని మరింత యాక్టివేట్ చేసేందుకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించినట్లు తెలిసింది. మొత్తం మీద బలగాన్ని మూడేళ్ల ముందు నుంచే ఎన్నికలకు నారా లోకేశ్ సిద్ధం చేస్తున్నారు. మరి యాక్టివ్ గా ఉండే కార్యకర్తలకు ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తారన్నది చూడాలి.

==============

# దువ్వాడకు లైన్ క్లియర్

శ్రీకాకుళం, ఫిబ్రవరి 13, (

ఏపీ అసెంబ్లీ ఆవరణలో మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కలవడం చర్చనీయాంశం అవుతోంది. గతేడాది ఏప్రిల్‌లో దువ్వాడను వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత వైసీపీ పార్టీకి, మాజీ సీఎం జగన్‌కు దూరంగా ఉన్నారు దువ్వాడ. అసెంబ్లీ సమావేశాల స్టార్టింగ్ రోజు సభకు అటెండ్ అయి వాకౌట్ చేసి వస్తున్న జగన్‌ను సడెన్‌గా వెళ్లి కలిశారు దువ్వాడ శ్రీనివాస్. జగన్ కాళ్లకు దండం పెట్టారాయాన.ఏం చేద్దామనుకుంటున్నావ్ శ్రీనివాస్ అంటూ జగన్ పకలరించగా..ధర్మాన సోదరులు మీకు రాంగ్ ఫీడ్ బ్యాక్ ఇచ్చారని..ధర్మానతో ఉన్న అంశాలపై మాట్లాడాలని దువ్వాడ జగన్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. దువ్వాడ శ్రీనివాస్‌కు జగన్ క్లాస్ పీకారని..కొంచెం పద్ధతి మార్చుకో అని చెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే జగనే పిలిచి..ఓ సారి వచ్చి కలవమంటే కలిశానని చెప్పుకుంటున్నారట దువ్వాడ. తాడేపల్లికి వచ్చి తనను కలవాలని దువ్వాడకు జగన్ చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.తన వాణి వినిపిస్తానని..త్వరలోనే జగన్‌ను కలుస్తానంటున్నారు దువ్వాడ. పైగా తిరుమల లడ్డూ వ్యవహారంలో భక్తుడి వైపు మాట్లాడతానని..మెడికల్ కాలేజీలని పీపీపీ విధానంలో చేపట్టాల్సిన అవసరం లేదని కూడా దువ్వాడ తన పాయింట్ వ్యూను వ్యక్తం చేస్తున్నారట. ధర్మాన, కింజరాపు సోదరులు సీట్ రాకుండా చేస్తే..వైసీపీ నుంచి జగన్ అవకాశం ఇవ్వకపోతే సొంతగా పోటీ చేసి తన బలం ఏంటో చూపించాలనే ఆలోచనలో దువ్వాడ ఉన్నట్లుగా ఇన్‌సైడ్ టాక్.వైసీపీ నుంచి సస్పెండ్ చేసినా, అధినేత జగన్ అంటే తనకు ఎంతో అభిమానమని ఎమ్మెల్సీ దువ్వాడ ఎప్పుడూ చెబుతుంటారు. అయితే పార్టీ నుంచి బయటకు పంపిన తర్వాత జగన్‌ను కలిసేందుకు ఆయనకు ఇంతవరకు అవకాశం దక్కలేదని చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దువ్వాడ ఆ జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌పై చేస్తున్న విమర్శలు వైసీపీని తీవ్ర ఇబ్బందికరంగా మారాయటపార్టీ సీనియర్లపై బహిరంగంగా విమర్శలు చేస్తున్న దువ్వాడ వ్యవహారం వైసీపీలో తీవ్ర చర్చే నడుస్తోందట. వైసీపీ నేతలైన ధర్మాన సోదరులను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ మళ్లీ పార్టీలోకి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం ఉంది. ఈ క్రమంలో పార్టీ అధినేత జగన్ ఆశీస్సుల కోసం ఎప్పటికప్పుడు ఆయనపై భక్తి ఉన్నట్లు చెప్పుకుంటున్నారట. అయితే దువ్వాడ విషయంలో జగన్ సాఫ్ట్ కార్నర్‌తో ఉన్నట్లుగా ఓ చర్చ నడుస్తోంది.దువ్వాడ ఫ్యామిలీ ఇష్యూ ఆయన



వ్యక్తిగతమైన..శ్రీకాకుళం జిల్లా నేతలతో ఉన్న పేచీని సెట్ చేసుకుంటే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేయొచ్చన్న అంచనాలున్నాయి. అయితే ధర్మానతో ఉన్న విభేదాలను జగన్ దృష్టికి తీసుకెళ్లి..తన నిర్ణయమేంటో ప్రకటించాలన్న ఆలోచనలో దువ్వాడ ఉన్నారట. అయితే 2029 ఎన్నికల్లో టెక్కలి నుంచి తాను పోటీ చేస్తానని, ఒకవేళ వైసీపీ టికెట్ ఇవ్వకున్నా ఇండిపెండెంట్‌గా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుస్తానని ఆయన చెప్పినట్లు వార్తలు రావడం వైసీపీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.అయితే ధర్మాన బ్రదర్స్‌ను టార్గెట్ చేస్తూ..తన కళింగ సామాజికవర్గంలో పట్టు పెంచుకునేందుకు దువ్వాడ పెద్ద స్కెచ్చే వేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయన సిక్కోలు పాలిటిక్స్‌లో ఒంటరి అయిపోయారని అంటున్నారు. ఓవైపు ఫ్యామిలీలో చిచ్చు..ప్రేయసితో కలిసి వేరు కాపురం ఇవన్నీ ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను పంపించాయని..వాటిని ఓవర్ కమ్ చేసేందుకే దువ్వాడ కళింగలకు అన్యాయమంటూ గళమెత్తడం స్టార్ట్ చేశారని అంటున్నారు.ఓవరాల్‌గా దువ్వాడ ఎపిసోడ్ శ్రీకాకుళంలో జిల్లాలో వైసీపీకి ఇబ్బందికరంగా మారిన పరిస్థితి. సేమ్‌టైమ్ టెక్కలి వైసీపీ ఇంచార్జ్ పేరాడ తిలక్ కూడా కళింగ సామాజికవర్గం నేత అయినా..ఆయనతో దువ్వాడకు గిట్టట్లేదట. ధర్మాన బ్రదర్స్ చెప్పుచేతల్లో పేరాడ తిలక్ పనిచేస్తూ..తన వ్యతిరేకతంగా పావులు కదుపుతున్నారని..గతంలో తనకు పార్టీ టికెట్ ఇస్తే ఆయన సహకరించలేదని అసంతృప్తితో ఉన్నారట దువ్వాడ. టెక్కలిలో ధర్మాన బ్రదర్స్ ఇన్వాల్‌మెంట్ లేకుండా..రాబోయే ఎన్నికల్లో తనకు టికెట్ ఇస్తానని హామీ ఇస్తే తిరిగి వైసీపీలో యాక్టీవ్ కావాలన్నది దువ్వాడ ఆలోచనగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దువ్వాడ విజ్ఞప్తిపై జగన్ నిర్ణయం ఎలా ఉండబోతుందనేది వేచి చూడాలి.

## విజయనగరానికి పూర్వ వైభవం

విజయనగరం.ఫిబ్రవరి 13,

ఉత్తరాంధ్ర ముఖచిత్రం వేగంగా మారుతోంది. విశాఖపట్నం ఐటీ , పారిశ్రామిక కేంద్రంగా విస్తరిస్తుండగా, దానికి ఆనుకుని ఉన్న విజయనగరం జిల్లా ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో రెండో హాట్‌స్పాట్ గా అవతరించింది. ముఖ్యంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులు 90 శాతానికి పైగా పూర్తి కావడమే కాకుండా, 2026 జూన్ నాటికి కమర్షియల్ ఆపరేషన్స్ ప్రారంభం కానుండటంతో ఇక్కడి భూముల ధరలకు రెక్కలొచ్చాయి.వలం పెట్టుబడిదారులే కాకుండా, విశాఖలో ఇళ్లు కొనలేని మధ్యతరగతి ప్రజలు కూడా విజయనగరం వైపు మొగ్గు చూపుతున్నారు. విజయనగరం ? విశాఖపట్నం మధ్య ఉన్న అనుసంధానత ఈ బూమ్‌కు ప్రధాన కారణం. విశాఖలోని మధురవాడ ఐటీ సెజ్ నుంచి విజయనగరం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం, విశాఖ-రాయ్‌పూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం కావడంతో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గింది.గంకలాం, నెల్లిమర్ల, చొట్టవలస వంటి ప్రాంతాల్లో పెద్ద ఎత్తున గేటెడ్ కమ్యూనిటీ లేఅవుట్లు వెలుస్తున్నాయి. విశాఖ నగర శివార్లలో గజం ధర రూ. 30,000 దాటగా, విజయనగరం పరిసరాల్లో ఇప్పటికీ రూ. 10,000 నుండి రూ. 15,000 మధ్య లభిస్తుండటం కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. మౌలిక సదుపాయాల పరంగా కూడా జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతోంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అనుబంధంగా ఏవియేషన్ సిటీ, లాజిస్టిక్స్ హబ్‌లు ఏర్పాటు కానుండటం వల్ల రాబోయే రోజుల్లో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.బీచ్ కారిడార్ రోడ్డు నిర్మాణం పూర్తయితే విజయనగరం నుండి విశాఖకు తీరం వెంబడి ప్రయాణం మరింత సులభతరం కానుంది. భవిష్యత్తులో ఈ రెండు నగరాలు జంట నగరాలుగా మారే అవకాశం ఉందన్న అంచనాలు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మరింత ఊతాన్నిస్తున్నాయి.

# మారకపోతే... వేటే

విజయవాడ, ఫిబ్రవరి 13, (న్యూస్ పల్స్)



టీడీపీ ఎమ్మెల్యేకు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ఏపీ అసెంబ్లీ లాబీల్లో ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారు.. ఇకపై పద్ధతి మార్చుకోవాలని పల్లా ఎమ్మెల్యేకు చెప్పారు. కొంతకాలంగా ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సొంత పార్టీ నేతలపై ఆరోపణలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు.. ఎన్నికల్లో టికెట్ కోసం డబ్బులు వసూలు చేశారంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే వాట్సాప్ స్టేటస్‌లతో సొంత పార్టీ నేతల్ని టార్గెట్ చేశారు. ఈ క్రమంలో టీడీపీ అధిష్టానం ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహంగా ఉంది.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది. అమరావతి ఉద్యమ నేతగా గుర్తింపు పొంది, చంద్రబాబు నాయుడు నమ్మకంతో టికెట్ ఇచ్చి గెలిపించిన కొలికపూడి.. ప్రస్తుతం అదే పార్టీకి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటిస్తున్నారా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. కొలికపూడి శ్రీనివాసరావు గత కొంతకాలంగా తన అసంతృప్తిని నేరుగా కాకుండా వాట్సాప్ స్టేటస్‌ల ద్వారా వ్యక్తం చేస్తున్నారు. ఆయన పెట్టిన ఓ స్టేటస్ కూటమి ప్రభుత్వంలో కలకలం రేపింది. 3 వారాల పాటు 35 గ్రామాల్లో 480 కుటుంబాలతో ఆత్మీయ సంభాషణ జరిపాను.. రోడ్లు లేని పల్లెలు, ఉద్యోగాలు రాని పిల్లలు.. పల్లె కన్నీరు పెడుతోంది అనే అర్థం వచ్చేలా ఆయన పోస్ట్ చేయడం, పరోక్షంగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడమేనని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యే అయి ఉండి, విపక్ష వైసీపీ విమర్శించే తీరులోనే ఆయన పోస్ట్‌లు ఉండటం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది.కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీలోని కీలక నేతలను కూడా ఆయన టార్గెట్ చేస్తున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తన వద్ద టికెట్ కోసం రూ. 5 కోట్లు డిమాండ్ చేశారని, ఇప్పటికే కొంత మొత్తం చెల్లించానని సంచలన ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, నియోజకవర్గంలో మండల అధ్యక్షుల ఎంపికలో తన ప్రమేయం లేదని, పేకాట క్లబ్‌లు నడిపేవారికి పదవులు ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఈ పరిణామాలు టీడీపీ హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారాయి.కొలికపూడి వైఖరి చూస్తుంటే ఆయన వైసీపీ వైపు అడుగులు వేస్తున్నారా అనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఎంపీ కేశినేని చిన్ని కూడా కొలికపూడిని వైసీపీ కోవర్టు గా అభివర్ణించడం ఈ అనుమానాలకు బలం చేకూర్చింది. గతంలో వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఆయన భేటీ అవ్వడం, వైసీపీ సర్పంచ్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు రావడంతో.. ఆయన త్వరలోనే కండువా మార్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.ఇప్పటికే టీడీపీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు నోటీసులు ఇచ్చి వివరణ కోరింది. చంద్రబాబు నాయుడు కూడా గతంలో ఆయనను హెచ్చరించినట్లు వార్తలు వచ్చాయి. అయితే, కొలికపూడి మాత్రం తన తీరు మార్చుకోకపోగా, మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ పార్టీ తనపై చర్యలు తీసుకుంటే, అది తనకు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందని, సానుభూతి పొందే అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన తన నియోజకవర్గంలో సొంతంగా కార్యక్రమాలు చేసుకుంటూ, పార్టీ యంత్రాంగాన్ని పక్కన పెట్టేశారు. అలాగే టీడీపీ నుంచి కూడా ఆయనకు పిలుపులు రావడం లేదు. అమరావతి ఉద్యమంతో కొలికపూడి శ్రీనివాసరావు మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో టీడీపీ తిరువూరు టికెట్ ఇచ్చింది.. ఆయన విజయం సాధించారు. ఆ తర్వాత నుంచి ఆయన వరుసగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. సొంత పార్టీ నేతల్ని టార్గెట్ చేయడంతో అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో ఒకసారి అధిష్టానం పిలిచి మాట్లాడింది.. అయినా సరే ఆయన మాత్రం వెనక్కు తగ్గలేదు. ఆయన తీరు మార్చుకోకుండా సొంత పార్టీ నేతలపై వాట్సాప్ స్టేటస్‌లు పెట్టారు. అలాగే గతేడాది కొలికపూడి మాజీ మంత్రి పెద్దిరెడ్డిని ఎయిర్‌పోర్టులో కలవడంపై కూడా దుమారం రేగింది. అయితే ఈ ఎపిసోడ్‌పై అధిష్టానం ఆరా తీసింది. అయితే ఎయిర్‌పోర్ట్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎదురయ్యారని.. మర్యాదపూర్వకంగా పలకరించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దీని వెనుక ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని క్లారిటీ ఇచ్చారు. ఇలా ఎమ్మెల్యే శ్రీనివాసరావు వరుస వివాదాలతో అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది.. అందుకే పల్లా శ్రీనివాస్ కొలికపూడిని హెచ్చరించినట్లు తెలుస్తోంది. మరి ఇకపైనా ఆయన పద్ధతి మార్చుకుంటారో లేదో చూడాలి.

# బస్టాండ్ తరలింపుతో అవస్థలు

ఒంగోలు, ఫిబ్రవరి 13



ఒంగోలు బస్టాండ్ తరలింపు ప్రతిపాద తెరపైకి వచ్చింది. నగరంలో ట్రాఫిక్ సమ్యలు పెరగడంతో బస్టాండ్‌ను శివారు ప్రాంతానికి తరలించాలని ప్రతిపాదించారు. ఒంగోలు కార్పొరేషన్ సమావేశంలో ఎమ్మెల్యే ఈ అంశాన్ని ప్రస్తావించారు. నగర శివారు ప్రాంతంలో బస్టాండ్‌ను ఏర్పాటు చేస్తే బావుంటుంది అన్నారు. అయితే ఒంగోలు శివారు ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రజలు ఇబ్బందిపడతారని కొందరి వాదన. అయితే ప్రజల అభిప్రాయం తీసుకున్న తర్వాతే నిర్ణయం ఉంటుందంటున్నారు.ప్రకాశం జిల్లా ఒంగోలులో ట్రాఫిక్ రద్దీ పెరిగింది.. దీంతో రోడ్లను విస్తరించాలని నిర్ణయించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ కసరత్తు మొదలైంది. ట్రంక్ రోడ్డు విస్తరణ కోసం అధికారులు భవనాల యజమానులకు నోటీసులు కూడా జారీ చేశారు.. మరికొన్ని రోడ్లను కూడా త్వరలోనే విస్తరించేలా ప్లాన్ చేస్తున్నారు. అయితే ఒంగోలులో బస్టాండ్ సెంటర్‌తో పాటుగా మరికొన్ని చోట్ల ట్రాఫిక్ పెరిగింది. ఆర్టీసీ బస్టాండ్ నగరం నడిబొడ్డున ఉండటం, బస్సుల రాక పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌ను తరలించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. బస్టాండ్‌ను నగర శివారు ప్రాంతానికి తరలించాలని ప్రతిపాదించగా.. కొందరు మాత్రం ప్రస్తుతం అందరికి అందుబాటులో ఉన్న చోట నుంచి ఊరి చివరకు తరలిస్తే ఇబ్బందులు ఎదురవుతాయంటున్నారు. నగర శివారు ప్రాంతం కాకుండా ప్రత్యామ్నాయాలను చూడాలని కోరుతున్నారు.ఒంగోలు నగరం మధ్యలో అప్పటి అవసరాలకు తగ్గట్లుగా 11 ఎకరాల్లో బస్టాండ్‌తో పాటుగా గ్యారేజీ కూడా ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం బస్సుల రాకపోకలు పెరిగాయి.. రాజధాని ప్రాంతం నుంచి డైలీ సర్వీసుల సంఖ్య పెరిగింది. వీటికి తోడు ఏపీ, తెలంగాణ నుంచి తిరుపతి, బెంగళూరు, చెన్నై వైపు వెళ్లే బస్సుల కూడా వస్తున్నాయి. గతంతో పోలిస్తే ఒంగోలులో రద్దీ పెరిగింది.. బస్టాండ్‌లో మొత్తం 28 ఫ్లాట్‌ఫాంలు ఉంటే.. ప్రతి రోజూ 1500 వరకు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయని అంచనాలు ఉన్నాయి. కర్నూలు రోడ్డు, అద్దంకి బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదరవుతున్నాయి. అందుకే ఇటీవల ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆర్టీసీ బస్టాండ్‌ను తరలించాలని అధికారులకు లేఖ రాశారు.ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌ను నగర శివారులో ఉన్న మార్కెట్ యార్డు దగ్గర పది ఎకరాలు స్థలంలోకి తరలించాలని ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. రెండు రోజుల క్రితం జరిగిన ఒంగోలు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే జనార్ధన్ రావు ప్రస్తావించారు. బస్టాండ్‌ను అక్కడికి తరలించి.. పీపీపీ విధానంలో అక్కడ కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని కూడా ప్రతిపాదించారు. అలా చేస్తే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందంటున్నారు. అయితే ప్రస్తుతం బస్టాండ్ ఒంగోలుకు మధ్యలో ఉంది.. ఒకవేళ నగర శివారు ప్రాంతానికి తరలిస్తే ప్రయాణికులు, ఒంగోలు పనులపై వచ్చేవారు ఇబ్బందిపడతారంటున్నారు. ప్రయాణికులు నగరంలో నుంచి ఊరి చివరికి వెళ్లడానికి ఇబ్బంది ఎదురవుతుందంటున్నారు. అయితే నగరంలో మినీ బస్టాండ్ నిర్మిస్తే సరిపోతుందని.. అప్పుడు నగరంలోని ప్రధాన బస్టాండ్‌పై ఒత్తిడి తగ్గుతుందంటున్నారు. అయితే ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజల అభిప్రాయం తీసుకున్న తర్వాతే అంటున్నారు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్.

====================

# నెల్లూరు జిల్లా దగదర్తి ఎయిర్‌పోర్ట్

నెల్లూరు, ఫిబ్రవరి 13, (



నెల్లూరు జిల్లా దగదర్తిలో కొత్తగా ఎయిర్‌పోర్ట్ ప్లాన్ చేశారు.ఇప్పటికే భూ సేకరణ చేసిన అధికారులు.. తదుపరి కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ రంగంలోకి దిగింది. దగదర్తి విమానాశ్రయ భూముల్లో డ్రోన్ సాయంతో ఓఎల్ఎస్ సర్వే చేసింది. ఈ మేరకు ఈ సర్వే రిపోర్ట్ పరిశీలించిన తర్వాత పూర్తి స్థాయిలో క్లారిటీ వస్తుంది అంటున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త ఎయిర్‌పోర్టులపై ఫోకస్ పెట్టింది.. కేంద్రం సాయంతో ఈ పనుల్ని వేగవంతం చేసింది. తాజాగా నెల్లూరు జిల్లా దగదర్తి ఎయిర్‌పోర్ట్‌కు సంబంధించి కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ టీమ్ విమానాశ్రయానికి సంబంధించిన భూముల్లో ఓఎల్ఎస్ సర్వే చేసింది.. ఈ భూముల్ని డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ టీమ్ దగదర్తి విమానాశ్రయానికి సంబంధించి.. గతేడాది ఫిబ్రవరిలో భూముల్ని పరిశీలించింది. అయితే ఈ భూములకు సంబంధించి కొన్ని ఇబ్బందుల్ని ఆ టీమ్ గుర్తించింది. అప్పుడే ఆబ్స్టికల్ లిమిటేషన్ సర్ఫేసెస్ సర్వే (ఓఎల్ఎస్) చేస్తామని తెలిపింది.. ఆ తర్వాత ఓ రిపోర్ట్ ఇస్తామని చెప్పింది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ నుంచి వచ్చిన ఆదేశాలతో డ్రోన్ సర్వే చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ టీమ్‌కు స్థానికంగా ఉండే అధికారులు అవసరమైన సాయం చేస్తున్నారు.ఈ ఓఎల్ఎస్ సర్వేలో భాగంగా విమానాశ్రయాలు, వాటి పరిసర ప్రాంతాలను పరిశీలిస్తారు. అసలు ఆ ప్రాంతం విమానాల రాకపోకలకు సురక్షితమేనా, కాదా క్లారిటీకి వస్తారు. ఈ సర్వే తర్వాత.. విమానాశ్రయం భూముల్లో గుర్తించిన అంశాలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో అధికారులు ఓ నిర్ణయం తీసుకుంటారు. గతంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ టీమ్ భూముల్ని పరిశీలించడానికి వచ్చిన సమయంలో.. ప్రధానంగా మూడు అంశాలను గుర్తించినట్లు తెలుస్తోంది.దగదర్తి విమానాశ్రయం ప్రతిపాదించిన ప్రాంతంలో పడమర వైపు కొండ ప్రాంతం ఉంది. అంతేకాదు ఉత్తరం వైపున ఉన్న చెరువుతో పాటుగా భూముల్లోని దగదర్తి- ముంగమూరు కాలువలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మూడు అంశాలు అడ్డంకిగా మారుతుందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ మూడు అంశాలను పరిగణలోకి తీసుకుని.. ప్రస్తుతం సర్వే చేస్తున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ టీమ్ ఈ మూడు అంశాలను గుర్తించనుంది. అనంతరం ఎయిర్ పోర్ట్ అథారిటీ అధికారులకు ఓ రిపోర్ట్ అందజేయనున్నారు.ఈ మూడు సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఓ నిర్ణయానికి వస్తారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్ ను ఎన్నో ఏళ్ల క్రితమే ప్రతిపాదించారు.. కానీ ఆ దిశగా అడుగులుపడలేదు. కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఎయిర్‌పోర్ట్‌ల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది.. దగదర్తి ఎయిర్‌పోర్ట్ కోసం కూడా ప్రయత్నాలు చేసింది. ఈ మేరకు ఆ కసరత్తు కొనసాగుతోంది.

# ఏఐ వినియోగంపై కేంద్రం ఆంక్షలు

బెంగళూరు, ఫిబ్రవరి 12,

కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన కంటెంట్‌కు సంబంధించి కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఏఐ జనరేటెడ్ కంటెంట్‌ను ప్రచురించేటప్పుడు సోషల్ మీడియా వేదికలు తప్పనిసరిగా లేబుల్ (వాటర్ మార్క్) వేయాలని ఆదేశించింది. ఏఐ కంటెంట్‌ను అందరూ సులువుగా గుర్తించేలా ఆ లేబుల్ ఉండాలని స్పష్టం చేసింది. ఒకసారి మార్క్ చేసి కంటెంట్, మెటా డేటాను తొలగించడం లేదా దానిని కనిపించకుండా చేయడానికి అవకాశం ఉండరాదదని తెలిపింది. చట్టవిరుద్ధమైన, అభ్యంతకరమైన, మోసపూరిత కంటెంట్‌ను నిరోధించేందుకు ఆటోమేటెడ్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని సోషల్ మీడియా వేదికలకు సూచించింది. ఏఐ కంటెంట్‌ను దుర్వినియోగం చేస్తే జరిమానాలు, శిక్షల గురించి యూజర్లకు అవగాహన కల్పించాలని పేర్కొంది. ఇందుకోసం ప్రతి 3 నెలలకు ఒకసారి హెచ్చరికల సందేశాలు పంపించాలని తేల్చిచెప్పింది.తమ వేదికల్లో ఏఐ క్రియేషన్ లేదా డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించేందుకు కూడా సోషల్ మీడియ ప్లాట్‌మ్‌లకు గడువు విధించింది. ప్రభుత్వం లేదా న్యాయస్థానాలు ఆదేశాలు జారీ చేసినప్పుడు వాటిని మూడు గంటల్లోపే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో ఏఐ క్రియేటెడ్ కంటెంట్ వాడకం విపరీతంగా పెరిగిపోతోంది. ఏది అసలు? ఏది ఏఐ? అనేది గుర్తుపట్టలేనంతంగా ఉంటోంది. అందుకే ఏఐ కంటెంట్‌ను గుర్తించేలా వాటర్ మార్క్ పెట్టాలని సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం ఆదేశించింది.




# రూపురేఖలు మారుతున్న స్మార్ట్ సిటీ

కరీంనగర్, ఫిబ్రవరి 13

తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో కరీంనగర్ ఒకటి. స్మార్ట్ సిటీప్రాజెక్టుల కింద చేపట్టిన అభివృద్ధి పనులు నగర రూపురేఖలను మార్చేశాయి. మెరుగైన రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, ఇండోర్ స్టేడియం వంటి మౌలిక సదుపాయాలు పెరగడంతో, నగర శివారు ప్రాంతాలైన రేకుర్తి, తీగలగుట్టపల్లి , అల్గనూర్ వైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీగా పుంజుకుంది. ఇక్కడ ప్రస్తుతం చదరపు అడుగు ధర సగటున రూ. 7,000 నుండి రూ. 8,000 వరకు పలుకుతోంది.ఈ వృద్ధికి ప్రధాన కారణం ప్రతిష్టాత్మకమైన మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్. మానేరు నది తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే పనులు తుది దశకు చేరుకున్నాయి. దీనికి అనుబంధంగా నిర్మించిన కేబుల్ బ్రిడ్జి ,ఐటీ టవర్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాయి. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న భూములకు డిమాండ్ పెరగడమే కాకుండా, కమర్షియల్ వెంచర్లకు, లగ్జరీ అపార్ట్‌మెంట్‌లకు ఇది కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.కరీంనగర్ ఇప్పుడు కేవలం నివాస ప్రాంతంగానే కాకుండా, విద్య , వైద్య హబ్‌గా కూడా ఎదుగుతోంది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన మెడికల్ కాలేజీలు, మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులు మరియు శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్లాన్డ్ డెవలప్‌మెంట్ వల్ల పెట్టుబడిదారులు ఇక్కడ స్థిరాస్తులు కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా కొత్తగా ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ 2031 అమలులోకి వస్తే, నగరం చుట్టూ రింగ్ రోడ్డు కనెక్టివిటీ పెరిగి రియల్ ఎస్టేట్ విలువలు మరో 20 నుండి 30 శాతం పెరిగే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# గగన్ యాన్ మరింత ఆలస్యం

బెంగళూరు, ఫిబ్రవరి 12,

స్రో ప్రతిష్టాత్మక ప్రయోగం మరింత ఆలస్యం కాబోతోందా..? ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే.. అవుననిపిస్తుంది. వీలైనంత త్వరగా ప్రయోగాన్ని చేపట్టి సక్సెస్ కొట్టాలనుకున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు ఏదో ఒక అవరోధం ఎదురవుతూనే ఉంది. అవి కూడా ఊహించని అవరోధాలు.. కలలో కూడా.. శత్రు దేశాలు కూడా ఊహించని వైఫల్యాలు ఇటు ఇస్రోని కూడా షాక్ గురి చేసిన ఉదాహరణలు ఇటీవల వరుసగా జరిగాయి. అవే రాకెట్ ప్రయోగం ఫలితాలు.. అదే ఇప్పుడు ఇస్రో ప్రెస్టీజియస్ ప్రాజెక్టు అయిన గగన్‌యాన్ మరింత ఆలస్యం అవుతోంది..!!భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న ప్రయోగాల్లో గగన్ యాన్ ప్రాజెక్ట్ ఒకటి. ముందుగా 2027 లో గగన్ యాన్ ద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపేందుకు ఇస్రో ఏర్పాట్లు మొదలు పెట్టింది. భారత్ చేపట్టనున్న తొలి మానవ సహిత ప్రయోగం కావడంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇస్రో ఎక్కడా రిస్క్ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే ముందు అనేక దశల్లో ప్రయోగాత్మక ప్రయోగాలను చేపడుతోంది.. ఈ టెస్ట్ లాంచ్ ల ద్వారా వ్యోమగాములు క్షేమంగా తిరిగి రావడానికి ఎలాంటి సమస్యలు రాకుండా.. అలాగే అంతరిక్షంలో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా లేకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలిసేలా ఈ ప్రయోగాలు దోహదం చేస్తాయి. అసలు ప్రయోగం కంటే ముందు ఇలాంటి టెస్ట్ లాంచ్ లు 50 కి పైగా చేపట్టాల్సి ఉంటాయని ఇస్రో ముందే తెలిపింది.అయితే ఇప్పటికే పలు కీలక టెస్ట్ లాంచ్ లను ఇస్రో ఇప్పటికే పూర్తి చేసింది. కానీ ఇంకా కీలక దశలకు స్పందించిన ప్రయోగాలు ఫిబ్రవరి నుంచి పదికి పైగా ప్రయోగాత్మక ప్రయోగాలు చేపట్టాల్సి ఉందని ఇస్రో వర్గాలు అంటున్నాయి. కానీ అందుకు అనేక అవరోధాలు ఎదురవుతున్నాయి. ప్లానింగ్ ప్రకారం ఇస్రో చేపట్టాల్సిన ప్రయోగాలు వైఫల్యం కావడమే.. ఇస్రో జర్నీలో కీలకమైన అత్యంత నమ్మకమైన రాకెట్ గా పేరొందిన రాకెట్స్ వరుస అపజయాలు.. అవును యోగం చేపడుతుంది అంటే మనకంటే ఎక్కువగా పొరుగు దేశాలే వాటి విజయాన్ని నమ్ముతుంటాయి. అంతగా ఇస్రోకి కలిసొచ్చిన రాకెట్ విఫలం కావడం ఆర్థికంగా జరిగిన నష్టం కంటే సమయం వృథా అవడమే ఇపుడు ఇబ్బందిగా మారింది.ఇటీవల ఇస్రో చేపట్టి విఫలమైన ద్వారా అంతరిక్షంలోకి పంపిన ఇతర దేశాలకు చెందిన 15 ఉపగ్రహాలు వృథా అయ్యాయి. అంటే కమర్షియల్ గా భారత్ పై పెట్టుకున్న నమ్మకాలపై ప్రభావం పడింది. ఖూఒఎ-అ62 ప్రయోగ వైఫల్యం కావడంతో ఫిబ్రవరి నెలలో జరగాల్సిన గగన్ యాన్ మరో టెస్ట్ లాంచ్ ఆలస్యం అవుతోంది. ఇక కమర్షియల్ గా భారత్ కుదుర్చుకున్న ఒప్పందాల్లో భాగంగా సమయానికి చేపట్టాల్సిన ప్రయోగాలకు ప్రాధాన్యతనివాల్సి ఉంది. దీంతో గగన్ యాన్ ప్రాజెక్టు




అనుకున్న సమయానికి జరుగుతుందా లేదా అన్నది ఇప్పుడు పెద్ద అనుమానంగా మారింది.గగన్‌యాన్ ప్రయోగం భారతదేశపు మొట్టమొదటి మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం. ఇందులో ముగ్గురు వ్యోమగాములను కూడా భూమి దిగువ కక్ష్యకు (శ్రీనీలి ఎర్త్ ఆర్బిట్) తీసుకువెళుతుంది. వ్యోమగాముల సిబ్బందితో కూడిన ఈ మిషన్ అంతరిక్షంలో దాదాపు మూడు రోజులు ఉంటుంది. గగన్‌యాన్ అని పిలువబడే సిబ్బంది లేని ఫ్లైట్ ఇది మొదట అన్ని వ్యవస్థలను పరీక్షిస్తుంది. ఇందులో ప్రయోగాత్మకంగా ప్రయాణీకుడిగా వ్యోమమిత్ర అనే హ్యూమనాయిడ్ రోబోట్ కూడా ఇందులో అమర్చి పెట్టనున్నారు. సమయానికి గగన్‌యాన్ పూర్తి కావాలంటే ముందుగా చేపట్టాల్సిన టెస్ట్ లాంచ్ లు పూర్తి కావాల్సి ఉంది. ఇవన్నీ దాటుకుని ఇస్రో అనుకున్న సమయానికి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గగన్‌యాన్ పూర్తి చేస్తుందా అన్నది చూడాల్సి ఉంది..!

# గ్రేటర్ అప్పులు ఎవరు తీరుస్తారు...

హైదరాబాద్, ఫిబ్రవరి 13,

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ముఖచిత్రం మారిపోయింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్..మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గా విభజించింది ప్రభుత్వం. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం..తర్వాత వార్డుల విభజన..కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి. ఓ వైపు సికింద్రాబాద్ పేరే లేకుండా చేశారని లష్కర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జంట నగరాల్లో ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్న సికింద్రాబాద్ ప్రాంతాన్ని మల్కాజ్‌గిరిలో నగం..హైదరాబాద్ కార్పొరేషన్‌లో నగం కలిపేసి..సికింద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు లేకుండా చేశారని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాము అధికారంలోకి వచ్చాక సికింద్రాబాద్‌ను జిల్లా చేస్తామంటూ ప్రకటించింది. ఇక జనగణన నోటిఫికేషన్ రిలీజ్ అయ్యాక..గ్రేటర్‌లో వార్డుల విభజన, కార్పొరేషన్ల ఏర్పాటు చేశారని ఇది పూర్తిగా చట్ట విరుద్ధమని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.పైగా కొత్త కార్పొరేషన్ల ఏర్పాటులో..కోర్ హైదరాబాద్ రీజియన్‌లో ఎంఐఎం బలం పెరిగేలా కుట్రకు తెరలేపారని కమలనాథులు మండిపడుతున్నారు. రాజకీయ అభ్యంతరాలు ఇలా ఉండగా..ప్రభుత్వం మాత్రం అడ్మినిస్ట్రేషన్ పరంగా తన పని తాను చేసుకుపోతోంది. మూడు కార్పొరేషన్లకు కలిపి ఒకే స్పెషల్ ఆఫీసర్‌ను వేసింది సర్కార్. పైగా కొత్తగా సర్కార్ తీసుకొచ్చిన కొన్ని మార్పులు కార్పొరేషన్ల అధికారాలనే కాదు..ఆర్థిక వనరులను కూడా తగ్గించి పూర్తిగా ప్రభుత్వంపైనే డిపెండ్ అయ్యే పరిస్థితిని తీసుకొస్తుందన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. పరిధిలో ఉన్న శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్ల నుంచి గతంలో బల్దియాకు భారీ ఆస్తి పన్ను, టౌన్ ప్లానింగ్ నిర్మాణ ఫీజులతో ఆదాయం వచ్చేది. ఇప్పుడా మూడు జోన్లను వేర్వేరు కార్పొరేషన్లలో కలిపేశారు. ఇక ప్రస్తుతం ఉన్న పరిధిలో సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్ జోన్ల పరిధిలో నిర్మాణానికి అవకాశం ఉండే భూములు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో విభజిత ప్రాంతం నుంచి వచ్చే ఆదాయం చాలా తక్కువగా ఉంటుందనేది అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్ కమ్ తగ్గి..మెయింటెనెన్స్ ఖర్చులు మాత్రం భారంగా మారే అవకాశం ఉందంటున్నారు పలువురు అధికారులుఇక మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి..నిర్మాణ అనుమతుల విషయంలో భారీ మార్పులు తీసుకొచ్చింది ప్రభుత్వం. 10 ఫ్లోర్ల వరకు మాత్రమే అనుమతులు అధికారం కార్పొరేషన్ అధికారులకు ఇచ్చింది. 10 ఫ్లోర్ల కంటే ఎక్కువ ఉండే అన్ని నిర్మాణాలకు ద్వారా పర్మిషన్లు ఇవ్వాలని డిసైడ్ చేసింది ప్రభుత్వం. గ్రేటర్ చుట్టూ జరగబోయే పెద్ద పెద్ద నిర్మాణాలకు సంబంధించిన ఫీజులు..నిర్మాణ అనుమతుల ఫీజులు మొత్తంఖజానాకు చేరే అవకాశం ఉందంటున్నారు.ఇప్పటికే రిజిస్ట్రేషన్ల సందర్భం కార్పొరేషన్లకు రావాల్సిన నొటేషన్ ఫీజు మొత్తం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుంది. ఇలా మూడు కార్పొరేషన్లకు వచ్చే నిర్మాణ అనుమతుల ఫీజు భారీగా తగ్గిపోయే పరిస్థితులు కనబడుతున్నాయి. దాంతో ఆర్థిక వనరులు తగ్గనున్నాయి. నిర్మాణ అనుమతుల విషయంలో సూపర్ పవర్‌గా మారే అవకాశం కనిపిస్తుంది. ఇక హైడ్రాకు ఇప్పటికే ఫైర్ సేఫ్టీ, మాన్ సూన్ ఎమర్జెన్సీ టీముల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది సర్కార్.ఇలా కార్పొరేషన్ అధికారులు చేయాల్సిన పనులన్నీ హైడ్రాకు, వెళ్లిపోయాయన్న చర్చ ఉంది. ఇక మూడు కార్పొరేషన్లకు కలిపి జయుష్ రంజన్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించడంతో..కార్పొరేషన్లు ఏం పని చేయాలన్నా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్ కానుంది. ఇలా ఒకవైపు స్పెషల్ ఆఫీసర్..ఇంకోవైపు.మరోవైపు హైడ్రా..మధ్యలో కార్పొరేషన్లు అన్నట్లు మారిపోనుంది పరిస్థితి2016 నుంచి 7వేల కోట్లకు పైగా అప్పులు చేసింది . ప్రస్తుతం 4860 కోట్ల రూపాయల అప్పులు ఉన్నాయి. వీటిని మూడు కార్పొరేషన్లకు ఎలా పంచుతారన్నది క్లారిటీ రాలేదు. ఒకవైపు ఆదాయం తగ్గిపోవడం, మరొక వైపు కార్పొరేషన్ పవర్స్‌పై రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ, హైడ్రా పట్టు సాధిస్తుండడంతో..మూడు కార్పొరేషన్లు ఎలా ముందుకు వెళ్తాయనేది హాట్ టాపిక్ అయ్యింది. కేవలం నిర్వహణ పనులు మాత్రమే ఈ కార్పొరేషన్లు చేపట్టే అవకాశం ఉంది.ఇక కార్పొరేషన్ల ముందున్న అతి పెద్ద సమస్య ఉద్యోగుల కొరత. కోర్‌నే సిబ్బంది, అధికారుల కొరత తీవ్రంగా ఉండేది. ఉన్నవారిలోనే మూడు కార్పొరేషన్లకు చాలామందిని బదిలీ చేశారు. దాంతో లో ఉన్న సిబ్బంది తగ్గిపోగా..మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్లలో కూడా సరైన సిబ్బంది లేరు. ఇలా ముందు చూపులేకుండా..వ్యవస్థలను సెట్‌రైట్ చేయకుండా..ఆగ మేఘాలపై మూడు కార్పొరేషన్లు చేయడంతో వివాదాలు, సమస్యలు తలెత్తాయన్న టాక్ వినిపిస్తోంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల విలీనం అయినప్పటి నుంచి శివారు ప్రాంతాలతో పాటు లో కూడా పాలన పడకేసిన పరిస్థితి. వార్డులు, జోన్లు, సర్కిల్స్ అవిభజన అధికారుల కేటాయింపునకే టైమ్ సరిపోయింది. ఇప్పటికీ బర్త్ అండ్ డెత్ సర్టిఫికెట్ల జారీలో క్లారిటీ రాక దరఖాస్తులు పెండింగ్ ఉండిపోతున్నాయి. నిర్మాణ అనుమతుల విషయంలోనూ..నొటేషన్ల విషయంలోనూ సాగదీత కంటిన్యూ అవుతోంది. దీంతో గ్రేటర్‌లో విలీనం, విభజన, కొత్త కార్పొరేషన్ల ఏర్పాటుతో లాభం కంటే నష్టమే ఎక్కువ ఉందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఫైనల్‌గా సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.




# ఎలుగబంటి బీభత్సం

అదిలాబాద్, ఫిబ్రవరి 13, (న్యూస్ పల్స్)

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల సరిహద్దుల్లో ఎలుగుబంటి సృష్టించిన బీభత్సం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా దయాల్ ధన్నూర్ గ్రామ శివారులో పొలం పనుల్లో ఉన్న ఎనిమిది మందిపై ఒక ఎలుగుబంటి ఒక్కసారిగా విరుచుకుపడింది. ఈ భీకర దాడిలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. మిగిలిన ఆరుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన తెలంగాణ సరిహద్దుకు కేవలం ఒక కిలోమీటర్ దూరంలోనే జరగడంతో అటవీ శాఖ యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగిందిఎనిమిది మందిపై దాడి చేసి తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఆ ఎలుగుబంటి, ఇప్పుడు తెలంగాణ భూభాగంలోకి ప్రవేశించినట్లు అటవీ అధికారులకు సమాచారం అందింది. దీంతో ఆదిలాబాద్ జిల్లా అటవీ శాఖాధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ సరిహద్దు గ్రామాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ముఖ్యంగా బోథ్ మండలంలోని నిగిని, మర్లపెల్లి అటవీ ప్రాంతాల్లో ఎలుగుబంటి సంచరించే అవకాశం ఉన్నందున, ఆ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నిగిని గ్రామం నుండి మహారాష్ట్రలోని శివిని పట్టణానికి వెళ్లే రహదారిపై ప్రయాణాలను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలపై ఈ మార్గంలో ఎవరూ వెళ్లవద్దని సూచించారు. అలాగే, పశువుల కాపరులు తమ పశువులను మేపడానికి అడవిలోకి తీసుకెళ్లవద్దని, రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ఒంటరిగా అటవీ శివారు ప్రాంతాలకు వెళ్లవద్దని



ఖరాకండిగా చెప్పారు. మనుషులపై దాడి చేసి రక్తరుచి మరిగిన ఎలుగుబంటి ఎదురుపడితే ప్రాణాపాయం పొంచి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం అటవీ శాఖ సిబ్బంది సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరం పహారా కాస్తున్నారు. ఎలుగుబంటి కదలికలను కనిపెట్టేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సమీప గ్రామాల ప్రజలు రాత్రి సమయాల్లో ఇళ్ల నుండి బయటకు రావద్దని, ఏవైనా అసాధారణ శబ్దాలు లేదా కదలికలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మృగం పట్టుబడే వరకు ప్రజలు గుంపులుగా ఉండాలని, స్వీయ రక్షణ చర్యలు పాటించాలని డి.ఎఫ్.ఓ ప్రశాంత్ బాజీరావ్ పాటిల్ విజ్ఞప్తి చేశారు.

# గతి శక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్

వరంగల్, ఫిబ్రవరి 13, (

తెలంగాణ రాష్ట్రంలో సరుకు రవాణా రంగం సరికొత్త పుంతలు తొక్కనుంది. దక్షిణ మధ్య రైల్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చర్యలతో రాష్ట్రంలోని మొట్టమొదటి 'గతి శక్తి మల్టీ-మోడల్ కార్గో టెర్మినల్' వరంగల్ జిల్లాలో ఏర్పాటు కానుంది. చారిత్రక నగరమైన వరంగల్ సమీపంలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ పరిధిలో ఈ మెగా ఫ్రైట్ టెర్మినల్ సేవలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటివరకు సరుకు రవాణా కోసం, కంటైనర్ల ఎగుమతి కోసం ఎక్కువగా హైదరాబాద్‌లోని సనత్‌నగర్ వంటి ప్రాంతాలపైనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ ఈ కొత్త టెర్మినల్ రాకతో ఉత్తర తెలంగాణ జిల్లాల ముఖచిత్రం మారబోతోంది.వరంగల్, హన్మకొండ చుట్టుపక్కల జిల్లాల్లో గ్రానైట్ పరిశ్రమ, వ్యవసాయ ఉత్పత్తులు (ముఖ్యంగా వరి, పత్తి, మిర్చి), టెక్స్‌టైల్స్ వ్యాపారం విస్తృతంగా ఉంది. ఈ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాలకు లేదా ఓడరేవులకు తరలించడానికి రోడ్డు మార్గంపై



ఆధారపడటం వల్ల రవాణా భారం అధికమయ్యేది. ఇప్పుడు రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ అత్యాధునిక టెర్మినల్‌ద్వారా తక్కువ ఖర్చుతో, సురక్షితంగా సరుకులను రవాణా చేసే వెసులుబాటు కలుగుతుంది. ఈ టెర్మినల్‌లో భారీ కంటైనర్లను హ్యాండిల్ చేయడానికి, నిల్వ చేయడానికి, ట్రక్కుల నుండి రైల్వే వ్యాగన్లకు సరుకు మార్చడానికి అధునాతన యంత్రాలను ఏర్పాటు చేశారు.ఇది కేవలం రవాణా కేంద్రంగానే కాకుండా, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ టెర్మినల్ చుట్టూ లాజిస్టిక్స్ పార్కులు, గోదాములు వెలిసే అవకాశం ఉండటంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన 'గతి శక్తి' విధానంలో భాగంగా దీనిని అభివృద్ధి చేశారు. ఈ టెర్మినల్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే, వరంగల్ నగరం తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద వాణిజ్య, రవాణా కేంద్రంగా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కమ్యూనిస్టులకు కాంగ్రెస్ కు ఎక్కడ చెడింది,...

ఖమ్మం ఫిబ్రవరి 13,

తెలంగాణ పాలిటిక్స్‌లో ఊహించని ట్విస్టులు తెరమీదకు వస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐతో పొత్తు, తెలంగాణ జన సమితి మద్దతులతో..కాంగ్రెస్ లబ్ధి పొందగలిగింది. అధికారంలోకి రావడంతో ఆ రెండు పార్టీల బంధాన్ని అలాగే కంటిన్యూ చేయాలని భావించింది కాంగ్రెస్ పార్టీ. ముందస్తుగా ఆ పార్టీలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హామీలను అమలు చేయాలనుకుంది.సీపీఐకి ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును కేటాయించింది. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరామ్ కూడా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ గా నామినేట్ చేసింది. ఇక నామినేటెడ్ పదవుల విషయంలో కూడా..పదవులు ఇచ్చి బంధాలను కంటిన్యూ చేసుకోవాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ బంధం నిన్న మొన్నటి వరకు అంతా బాగానే ఉన్నా..మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తూట్లు పడ్డాయి. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ ఎవరికి వారే పోటీ చేశారు.సీపీఐ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఏకైక నియోజకవర్గం కొత్తగూడెం. కూనంనేని సాంబశివరావు ఎమ్మెల్యే మాత్రమే కాదు.. సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూడా. అలాంటి వ్యక్తి ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్తగూడెంలోనే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్కు సీపీఐకి పొత్తు కుదరలేదు. దీంతో రాష్ట్రంలోని మిగతా చోట్ల కూడా కాంగ్రెస్తో పొత్తుకు బీటలు వారిందనే టాక్వినిపిస్తోంది.మున్సిపల్ ఎన్నికల సైరన్ మోగిన మొదట్లో.. రెండు పార్టీలు కలిసే పని చేయాలని భావించాయి. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా సీపీఐతో కలిసే పనిచేస్తాయంటూ పలుసార్లు స్టేట్మెంట్లు ఇచ్చారు. కానీ కొత్తగూడెం పొత్తు విషయంలో రెండు పార్టీలు పంతం పట్టాయి.కొత్తగూడెంలో తమ ఎమ్మెల్యే ఉండటంతో మున్సిపల్ టికెట్లలో తమకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఐ పట్టుబట్టింది. కానీ ఇక్కడ కాంగ్రెస్ ససేమిరా అంటూ మొండికేసింది. మెజారిటీ సీట్లు తమకే కావాలని కాంగ్రెస్ పట్టుపట్టింది. దీంతో ఆఖరి వరకు వేచి చూసిన సీపీఐ..ఒంటరి పోరుకు మొగ్గు చూపింది. దీంతో కొత్తగూడెం ఎఫెక్ట్..రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాలపై కూడా పడింది. చాలా మున్సిపాలిటీల్లో సీపీఐ, కాంగ్రెస్ ఎవరికి వారే పోటీ చేశారు. కొన్ని చోట్ల సీపీఐ నేతలు బీఆర్ఎస్ తోనూ జట్టు కట్టారు.కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ మధ్య గ్యాప్ రావడానికి ఓ కీలక మంత్రే కారణమని..రెండు పార్టీల్లో చర్చ జరుగుతోంది. కొత్తగూడెం విషయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మొదటి నుంచి కూడా స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. మొన్నటి ఎన్నికల్లో కొత్తగూడెం నుంచే పోటీ చేయాలని ఆయన భావించారు. కానీ పొత్తు కుదరడంతో..కొత్తగూడెం సీటును సీపీఐకి ఇచ్చి..తాను పాలేరుకు షిఫ్ట్ కావాల్సి వచ్చింది. కానీ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా కొత్తగూడెం నుంచే పోటీ చేయాలనే ఆలోచనలో పొంగులేటి ఉన్నారట.కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐని కాదని..ఒంటరి పోరాటానికి మొగ్గు చూపేలా స్కెచ్ వేశారట. ఇప్పుడు సీపీఐ రాష్ట్ర నాయకత్వం మంత్రి పొంగులేటి తీరుపై గుర్రుగా ఉందట. పొంగులేటి తీరు వల్లే రెండు పార్టీల మధ్య పొత్తుకు బీటలు వారాయని రగిలిపోతున్నారట.

# మేడారం కలెక్షన్లు 14 కోట్లే...

వరంగల్, ఫిబ్రవరి 13,

మేడారం హుండీల లెక్కింపు ప్రక్రియ పూర్తి అయింది. వారం రోజుల పాటు మొత్తం 500 మంది సిబ్బంది 828 హుండీలను లెక్కించారు. అయితే ప్రభుత్వం అంచనా వేసిన ఆదాయం మాత్రం రాకపోవడం గమనార్హం. ఈసారి మేడారంలో దాదాపు 300 అదనపు హుండీలు ఏర్పాటు చేసి.. రూ.40 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు భావించగా.. అందులో సగం కూడా రాలేదని వెల్లడించారు. ఇక వచ్చిన ఆదాయంలో 33 శాతం మేడారం పూజారులకు అందించాల్సి ఉంటుంది. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా భావించే.. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా పూర్తి అయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా మేడారం చేరుకుని సమ్మక్క సారలమ్మలకు మొక్కులు చెల్లించుకున్నారు. బియ్యం పోసి, బంగారం (బెల్లం) సమర్పించి.. కోరికలు కోరుకున్నారు. ఈ నేపథ్యంలోనే మహా జాతర పూర్తి కావడంతో.. మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను అధికారులు లెక్కించారు. హనుమకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి అన్ని హుండీలను తరలించిన అధికారులు లెక్కింపు పూర్తి చేశారు. ఇక మేడారం హుండీల్లో వచ్చిన ఆదాయంలో 33 శాతం అక్కడ పూజలు అందించిన పూజారులకు ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి చేరనుంది. ఈనెల 5వ తేదీన ప్రారంభమైన మేడారం హుండీల లెక్కింపు ప్రక్రియ వారం రోజుల పాటు కొనసాగి బుధవారం ముగిసింది. రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో దేవాదాయ శాఖ సిబ్బంది, వాలంటీర్లు కలిసి మొత్తం 500 మంది ఈ హుండీల్లోని సొమ్మును లెక్కించారు. మొత్తం 828 హుండీలను లెక్కించిన అధికారులు.. రూ.13,25,83,269 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. హుండీల లెక్కింపును పటిష్ఠ బందోబస్తు, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో లెక్కించారు. మేడారం హుండీల్లో పలు దేశాలకు చెందిన కరెన్సీ, రద్దు చేసిన నోట్లు, బంగారం, వెండి, గిల్టు నగలు కూడా ఉన్నాయని అధికారులు స్పష్టం చేశారు. 2 ఏళ్ల క్రితం 2024 మహా జాతరలో ఏర్పాటు చేసిన హుండీల్లో రూ.13,25,22,511 ఆదాయం వచ్చింది. ఈ ఏడాది కూడా దాదాపు అంతే మొత్తం రావడం విశేషం. 2024 జాతరలో మొత్తంగా 540 హుండీలను ఏర్పాటు చేయగా.. ఈసారి భారీగా పెంచారు. ఈసారి అదనంగా 288 హుండీలు జోడించిన అధికారులు ఏకంగా 828 హుండీలను మేడారంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయినప్పటికీ గతంలో వచ్చినంతే ఆదాయం ఇప్పుడు రావడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే మేడారం జాతరకు ఈసారి హుండీ ఆదాయం తగ్గినట్లు అధికారులు ప్రకటించారు. మరోవైపు.. ఈ హుండీ లెక్కింపులో భాగంగా వచ్చిన బియ్యాన్ని తూకం వేసి.. టెండర్ల ద్వారా విక్రయించనున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద 588 హుండీలు ఏర్పాటు చేయగా.. పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలకు సమీపంలో మరో 152 హుండీలను అధికారులు ఉంచారు. వడి బియ్యం కోసం.. తిరుగు వారం కోసం మరికొన్ని సహా మొత్తంగా 828 హుండీలను ఈసారి మేడారం జాతరలో ఏర్పాటు చేశారు. గత కొన్నేళ్లలో మేడారం హుండీ ఆదాయాన్ని పరిశీలిస్తే క్రమంగా పెరుగుతూ వస్తోంది. 2018 మహా జాతరలో మేడారం హుండీ ఆదాయం రూ.8.14





కోట్లు రాగా.. 2020లో అది రూ.9.87 కోట్లకు పెరిగింది. ఆ తర్వాత 2022లో రూ.12.45 కోట్లు మేడారం హుండీ ఆదాయం రాగా.. 2024 జాతరలో రూ.13 కోట్ల మేర ఆదాయం లభించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈసారి మేడారం జాతరను ప్రతిష్టాత్మకంగా చేపట్టి.. అక్కడ భారీగా సౌకర్యాలను ఏర్పాటు చేసింది. దీంతో భారీగా భక్తులు కూడా పోటెత్తారు. దీంతో హుండీ ఆదాయం కూడా గత జాతర కంటే 3 రెట్లు పెరుగుతుందని అధికార వర్గాలు అంచనా వేశాయి. హుండీలు కూడా అధికంగా ఏర్పాటు చేయడంతో సుమారు రూ.40 కోట్ల వరకు మేడారం హుండీల ద్వారా ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కానీ లెక్కింపు పూర్తి అయ్యేసరికి 2024 జాతర కంటే స్వల్పంగానే ఎక్కువ రావడం గమనార్హం. అయితే అధికారుల అంచనాల్లో సగం కూడా రాకపోవడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది

# జీవన్ రెడ్డి అంశం

## రెండుగా చీలిన కాంగ్రెస్

నిజామాబాద్, ఫిబ్రవరి 13,

మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ నిర్ణయాలను ధిక్కరించిన వారిపై సస్పెన్షన్ వేటు వేసేందుకు రంగం సిద్ధమయినట్లు తెలిసింది. కొందరిని పార్టీ నుంచి బహిష్కరించాలని కూడా నిర్ణయించారు. కాంగ్రెస్ అభ్యర్థులకు పోటీగా రెబల్స్ గా నిలిచిన వారిపై పార్టీ బహిష్కరణ వేటు వేయాలని డిసైడ్ అయింది. ఇప్పటికే అన్ని జిల్లాల నుంచి అందిన సమాచారం మేరకు కొందరిపై చర్యలకు సిద్ధమయింది. అయితే మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి విషయంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డిని సస్పెండ్ చేయాలని రేవంత్ రెడ్డి అనుకూల వర్గం, అలా కుదరదంటూ మరొక వర్గం తమ వాదనలను వినిపిస్తున్నారని తెలిసింది. జోగులాంబ గద్వాల జిల్లా మాజీ జడ్పీచైర్మన్ సరితా తిరుపతయ్య యాదవ్ తో పాటు వివిధ మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో రెబెల్స్ గా నిలిచిన వారిపై బహిష్కరణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. అయితే జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి సస్పెన్షన్ విషయంలో కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తలెత్తినట్లు తెలిసింది. జీవన్ రెడ్డిని ఇప్పటికే తీవ్రంగా అవమానించామని, పార్టీనే నమ్ముకుని ఉన్న జీవన్ రెడ్డిని పార్టీ మారి వచ్చిన ఒక ఎమ్మెల్యే కోసం బహిష్కరించాలనుకోవడం సరికాదని కొందరు వాదిస్తున్నారు. తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కొందరరు కాంగ్రెస్ నేతలు, మంత్రులు అలా చేస్తే తప్పుడు సంకేతాలు వెళతాయని అంటున్నారు. జీవన్ రెడ్డిని పిలిచి మాట్లాడాల్సిందని అంటున్నారు. పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నారు కాబట్టి వేటు తప్పదు రేవంత్ వర్గం వాదిస్తుంది. జీవన్ రెడ్డి విషయంలో రెండుగా చీలిన కాంగ్రెస్ నేతలు ఈ పంచాయతీని హైకమాండ్ వద్దకు తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. జగిత్యాలలో దాదాపు 20, గద్వాలలో ఏడు స్థానాల్లో పోటీలో



రెబెల్స్ నిలిచారు. ఆర్మూరు మున్సిపల్ బరిలో రెబల్స్ గా నలుగురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోటీలో ఉన్నారు. కరీంనగర్ నగర్ జిల్లా రాయికల్ మున్సిపాలిటీలోనూ, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సంగారెడ్డి మరియు సదాశివపేట మున్సిపాలిటీలలో రెబెల్స్, అసంతృప్తుల తో పాటు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేసినందుకు కొందరిపై యాక్షన్ కు సిద్ధమయినట్లు సమాచారం.

# మలక్ పేట లో ట్రాఫిక్ సేఫ్టీ అవగాహనా కార్యక్రమం

హైదరాబాద్ ఫిబ్రవరి 13

నేషనల్ రోడ్డు సేఫ్టీ ? ట్రాఫిక్ పోలీసుల అవగాహనా కార్యక్రమంలో భాగంగా నేషనల్ రోడ్డు సేఫ్టీ సందర్భంగా మలక్ పేట్ ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, అలాగే మనిషి విలువైన జీవితం గురించి ప్రత్యేకంగా చర్చించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ సిగ్నల్స్ను కచ్చితంగా పాటించాలి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదు. సీట్బెల్ట్ ధరించడం తప్పనిసరి. మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరం. ఓవర్ స్పీడ్, సెల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు దారి తీస్తాయని అన్నారు.

ట్రాఫిక్ నియమాలు మన భద్రత కోసమే రూపొందించబడ్డాయి. ఒక చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదానికి కారణమవుతుంది. కుటుంబ సభ్యులు మన కోసం ఎదురుచూస్తుంటారు ? కాబట్టి సురక్షితంగా ఇంటికి చేరుకోవడం మన బాధ్యత. డబ్బు, వస్తువులు తిరిగి సంపాదించవచ్చు. కానీ ఒకసారి కోల్పోయిన ప్రాణం తిరిగి రాదు. ప్రతి వాహనదారుడు తన ప్రాణాన్ని, ఇతరుల ప్రాణాలను గౌరవించాలి. ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పాంప్లెట్లు పంపిణీ చేసి, రూల్స్ పాటించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో మలక్ పేట్, సైదాబాద్ ఏసీపీ, ఇన్స్పెక్టర్స్, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాచిగూడలో వాలెంటైన్ డే కార్డుల దహనం

## భజరంగ్ సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

హైదరాబాద్ ఫిబ్రవరి 13

హైదరాబాద్ నగరంలోని కాచిగూడ చౌరస్తాలో తెలంగాణ భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్. లక్ష్మణ్ ఆధ్వర్యంలో వాలెంటైన్ డే కార్డులను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. పాశ్చాత్య సంస్కృతిని ప్రోత్సహించే వాలెంటైన్ డే వేడుకలను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, “వాలెంటైన్ డే మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధం. ఇటువంటి పాశ్చాత్య ప్రభావాలు యువతను తప్పుదారి పట్టిస్తున్నాయి. ఇప్పటికే యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్నది. గత కొన్ని రోజులుగా పట్టుబడుతున్న మత్తు పదార్థాల కేసులు ఇందుకు నిదర్శనం. ఇలాంటి వేడుకలు యువతలో అనవసర ఆలోచనలు, చెడు అలవాట్లకు దారితీస్తున్నాయి” అని విమర్శించారు. యువత పాశ్చాత్య సంస్కృతిని అనుసరించకుండా, మన సంప్రదాయ పండుగలను ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహాశివరాత్రి, ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వంటి జాతీయ, ఆధ్యాత్మిక వేడుకలను ఉత్సాహంగా నిర్వహించి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి యువకుడిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని నినాదాలు చేస్తూ వాలెంటైన్ డే వ్యతిరేకంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వడ్డేపల్లిలో కవిత పార్టీ గెలుపు

## కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు షాక్..

హైదరాబాద్, ఫిబ్రవరి 13

మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలంగాణ రాజకీయాల్లో బోణి కొట్టారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆమె మద్దతుదారులు సత్తా చాటారు. భారీ విజయం సాధించటమే కాకుండా ఏకంగా ఓ మున్సిపాలిటీని కైవసం చేసుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీని కవిత మద్దతుదారులు దక్కించుకున్నారు. ఇక్కడ మొత్తం 10 వార్డులు ఉండగా.. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేసిన కవిత మద్దతుదారులు ఏకంగా 8 వార్డులను కైవసం చేసుకున్నారు. మిగిలిని రెండు స్థానాల్లో అధికార కాంగ్రెస్ 1, బీఆర్ఎస్ 1 వార్డు గెలుచుకున్నారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఓచోట ఆసక్తికరమైన ఫలితం వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తుండగా.. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీ రాష్ట్రవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. వడ్డేపల్లి మున్సిపాలిటీని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సొంతం చేసుకుంది. ఇతర చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు సాగుతుంటే, వడ్డేపల్లిలో మాత్రం ఫలితం విభిన్నంగా వచ్చింది. ఇక్కడి ఓటర్లు అందరి అంచనాలను తలకిందులు చేస్తూ వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి విజయాన్ని అందించారు. మొత్తం 10 వార్డులు ఉన్న ఈ మున్సిపాలిటీలో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు ఏకంగా 8 స్థానాల్లో విజయం సాధించి తమ సత్తా చాటారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ఒక్కో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పార్టీల హవా కొనసాగుతున్న తరుణంలో, ఒక చిన్న పార్టీ ఈ స్థాయిలో మెజారిటీ సాధించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఈ ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు మద్దతు తెలిపారు. దాంతో ఇక్కడ ఫలితాల్లో సీన్ రివర్స్ అయింది. అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ఎజెండాగా బరిలోకి దిగిన ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రధాన పార్టీలను కాదని, స్థానికంగా అందుబాటులో ఉండే నేతలకే ఓటర్లు పట్టం కట్టారు. ఈ విజయంతో వడ్డేపల్లిలో ఫార్వర్డ్ బ్లాక్ శ్రేణులు భారీ ఎత్తున సంబరాలు నిర్వహిస్తున్నాయి. ఈ ఫలితం రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలకు ఒక విభిన్నమైన సందేశాన్ని పంపినట్లయ్యింది. ప్రస్తుతానికి కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. నేరేడుచర్ల, హాలియా, నందికొండ, హుజూర్‌నగర్, చండూరు, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, మంథని, చొప్పదండి, సుల్తానాబాద్, మరిపెడ, డోర్నకల్, అశ్వారావుపేట, కొడంగల్, నారాయణ ఖేడ్, స్టేషన్ ఘన్‌పూర్ లలో కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ గడ్డపోతారం, ఇంద్రేశం, అయిజ, తొర్రూర్‌లలో గెలుపొందింది. గద్వాల జోగులాంబ జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాలిటీలో ఫార్వర్డ్ బ్లాక్ నెగ్గింది. భైంసా మున్సిపాలిటీలో ఎంఐఎం విజయం సాధించింది.

# నగరంలో అనధికారిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు.

**బి.పి.ఎస్., ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారానికై కంట్రోల్ నెంబర్ ఏర్పాటు.**

**అనధికారిక ఇంటి పన్నులు మార్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం.**

**సమస్యల పరిష్కారానికై కంట్రోల్ నెంబర్ : 0877- 2256766. 9000822909**

తిరుపతి ఫిబ్రవరి 13

నగరంలో తోపుడు బండ్లు, పండ్లు, పూలు, కూరగాయలు విక్రయించే వారి వద్ద ఎవరైనా అనధికారిక వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, కమిషనర్ ఎన్.మౌర్య హెచ్చరించారు.. నగరంలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ టెండర్ దారుడు సకాలంలో నగదు చెల్లించనందున టెండర్ రద్దు చేశారని తెలిపారు. కావున మార్కెట్ కు సంబందించిన వసూళ్లు నగరపాలక సంస్థ సిబ్బంది చేస్తున్నారని తెలిపారు. ప్రయివేట్ వ్యక్తులు ఎవ్వరూ కూడా నగరంలో పన్నులు పండ్లు, కూరగాయలు, పూలు, తోపుడు బండ్ల వారి వద్ద నగదు వసూలు చేయరాదనీ తెలిపారు. నగరపాలక సంస్థ సిబ్బంది కాకుండా ప్రయివేట్ వ్యక్తులు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారానికి కంట్రోల్ నెంబర్. బి.పి.ఎస్, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ నెంబర్లు 0877- 2256766, 9000822909 ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరి దరఖాస్తులు ఎక్కడ ఉన్నాయి, ఎన్ని రోజుల్లో క్లియర్ అవుతాయి వంటి సమాచారం ఎప్పటికప్పుడు తెలిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే అవసరమైన పత్రాల సమాచారం కూడా అందించి త్వరితగతిన పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలే స్వయంగా ఆన్లైన్ ద్వారా బి.పి.ఎస్. ధరఖాస్తులు చేసుకునేలా అవకాశం కల్పించిందని తెలిపారు. డ్రాయింగ్ తయారు చేసి ఃఖా దరఖాస్తు దాఖలు చేయుటకు మీ దగ్గరలోని సచివాలయ ప్లానింగ్ సెక్రటరీని సంప్రదించాలని, డ్రాయింగ్ తయారికి ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవసరము లేదని తెలిపారు. అనధికారిక ఇంటి పన్నులు మార్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. నగరపాలక సంస్థ పరిధిలో కొంతమంది ఇంటి యజమానులు ఎటువంటి పత్రాలు సమర్పించకుండా పన్నులు మార్చుకున్న, మార్చిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ వెబ్ సైట్ లో మార్పుదల చేసినట్లు గుర్తించామని తెలిపారు. దీనిపై విచారణ చేయాలని సైబర్ క్రైమ్ అధికారులకు, పిర్యాదు చేశామని తెలిపారు.

# ఐఐటి హైదరాబాద్ ఏన్ జెన్ తపాలా కార్యాలయాన్ని సందర్శించిన ప్రొబేషనరీ అధికారుల బృందం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 13 :




సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని ఐఐటి హైదరాబాద్ ప్రాంగణంలోని ఏంజన్ తపాలా కార్యాలయాన్ని ఇండియన్ పోస్టల్ సర్వీస్కు చెందిన తొమ్మిది మంది ప్రొఫెషనరీ అధికారుల ప్రతినిధి బృందం సందర్శించారు. వీరిలో ఏడుగురు భారతదేశం నుండి కాగా ఇద్దరు భూటాన్ రాయల్ గవర్నమెంట్ నుండి రావడం జరిగింది. ఏంజెల్ తపాలా కార్యాలయం ఆధునిక యుగానికి తగిన విధంగా సాంప్రదాయ తపాలా అనుభవాన్ని కొత్తగా నిర్వర్తించాలని వారసత్వాన్ని ఆధునిక సాంకేతికత సమన్వయం చేసేందుకు ఐఐటి హైదరాబాద్ డిజైన్ బృందాన్ని ప్రశంసించారు. వీటిలో వాస్తు శిల్ప సమన్వయం, కళాత్మక ప్రేరణ, సహకార ఆవిష్కరణ, అంశాలను నిశితంగా పరిశీలించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు ప్రతినిధుల బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వెబ్ కాస్టింగ్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియ పర్యవేక్షణ: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 (భారతశక్తి): జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐడీఓసీ కార్యాలయం నుండి శుక్రవారం వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ప్రతి దశను పర్యవేక్షిస్తూ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా లెక్కింపు జరుగుతున్నదని తెలిపారు. కౌంటింగ్ హాళ్లలో భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేయబడినట్లు, ప్రతి టేబుల్ వద్ద మైక్రో అబ్జర్వర్లు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. బ్యాలెట్ బాక్సుల సీల్స్ పరిశీలన, ఓట్ల లెక్కింపు, రౌండ్ వారీ ఫలితాల నమోదు వంటి అంశాలను జిల్లా స్థాయి నుండి నిరంతరం పర్యవేక్షిస్తూ ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రక్రియ కొనసాగేందుకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేస్తున్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



వై ఎస్ ఆర్ కడప, ఫిబ్రవరి 13(భారత శక్తి) : మహాశివరాత్రి పర్వదిన మహోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రధాన శైవక్షేత్రాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటన లో తెలిపారు.

జిల్లాలోని 16 ప్రముఖ శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారని, తరలివచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు, భద్రతా ఏర్పాట్లను కల్పిస్తూ.. పార్వతీపరమేశ్వరుల కళ్యాణోత్సవాలు, ఊరేగింపు తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం.. దేవాదాయ, రెవెన్యూ, పోలీసు శాఖల ద్వారా అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టిందనన్నారు.

జిల్లా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ (నెం : 08562 - 246344) ఏర్పాటు :

శైవ క్షేత్రాలకు వచ్చే భక్తులకు సమాచార, సహాయం నిమిత్తం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని 21 మంది సిబ్బంది తో 3 షిఫ్టుల్లో 24/7 విధులను కేటాయించడం జరిగిందని ఈ నెల 15న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని 14-02-2026 తేదీ నుండి 16-02-2026 తేదీ వరకు.. 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మున్సిపాలిటీలో ఉద్యమకారుడి గెలుపు 64 ఓట్ల మెజారిటీతో 9వ వార్డులో గెలిచిన గండ్రకోట వాణి కుమార్ యాదవ్



ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13 (భారత శక్తి): ములుగు మున్సిపాలిటీలో జిల్లా సాధన ఉద్యమకారుడికి ప్రజలు పట్టం కట్టారు. ఈనెల 11న జరిగిన ఎన్నికల్లో స్వంత్ర అభ్యర్థిగా 9 వవార్డు నుంచి బరిలో నిలిచిన గండ్రకోట వాణి కుమార్? యాదవ్? లను ఓటర్లు సాదరంగా అక్కున చేర్చుకున్నారు. కాంగ్రెస్? పార్టీ అభ్యర్థిపై 64 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన వాణి కుమార్? యాదవ్ తెలంగాణ, ములుగు జిల్లా సాధన ఉద్యమాల్లో ముందుండి పోరాడారు. కాంగ్రెస్?, బీఆర్?ఎస్?, బీజేపీ పార్టీలతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులు బరిలో నిలువగా ఏడుగురిలో స్వతంత్ర అభ్యర్థి అయిన వాణి కుమార్? ను గెలిపించుకోవడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తం అవుతోంది. గత బీఆర్?ఎస్? పాలనలో 2016లో ప్రత్యేక జిల్లాలను ఏర్పాటు చేసిన సందర్భంలో ములుగుకు అన్యాయం జరుగగా జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రస్తుత రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి పోరాటాలు చేశారు. జర్నలిస్టుల పాదయాత్ర సైతం విజయవంతంగా పూర్తికాగా డిసెంబర్? 1, 2016న జిల్లా ఆత్మగౌరవ సభ జరుగగా కుమార్? సభాధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. కాగా, ప్రస్తుత మున్సిపాలిటీ ఎన్నికల్లో బరిలో నిలిచిన కుమార్? యాదవ్? తాను కొట్లాడి సమస్యలు పరిష్కరిస్తాననే హామీతో ముందుకు వెళ్లగా ప్రజలు స్వాగతించారు. కాగా, శుక్రవారం సాయంత్రం ములుగులోని 9వ వార్డు పరిధిలో భారీ ర్యాలీ నిర్వహించి వార్డు ప్రజలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయంతో స్థానికంగా అన్ని పార్టీల్లో హర్షం వ్యక్తం చేశారు.

# ప్రపంచ స్థాయి పరిశ్రమలతో ఐఐటి హైదరాబాద్ భాగస్వామ్యం: ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి ఎస్ మూర్తి



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 13:

సంగారెడ్డి జిల్లా కంది ఐఐటి క్యాంపస్లో జపాన్ కు చెందిన మిస్సుబిషీ ఎలక్ట్రిక్ కార్పోరేషన్ మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఐఐటి డైరెక్టర్ బి ఎస్ మూర్తి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు క్వాంటం సాంకేతికథలు సైబర్ భద్రతా వంటి రంగాల్లో సంయుక్త పరిశోధన శిక్షణ కార్యక్రమాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ ఒప్పందం కింద కృత్రిమ మేధస్సు క్వాంటం సాంకేతికలు సైబర్ భద్రతా స్మార్ట్ వ్యవస్థలు వంటి రంగాల్లో రెండు సంస్థలు కలిసి పరిశోధనలు చేపట్టనున్నాయని వెల్లడించారు. ప్రపంచ స్థాయి పరిశ్రమతో భాగస్వామ్యం చేయడం ద్వారా ఐఐటి హైదరాబాద్ పరిశోధనలకు అంతర్జాతీయ విస్తృతి లభిస్తుంది అన్నారు. మానవత్వం కోసం సాంకేతిక ఆవిష్కరణలు చేపట్టడమే మా లక్ష్యమని ఈ భాగస్వామ్యం దిశగా మరో ముందడుగు పడిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిశోధన వేదికలో మరింత కీలక భాగస్వామిగా ఐఐటి నిలుస్తుంది అన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విద్యా సంస్థగా పరిశ్రమల అనుసంధానం ఆవిష్కరణలు స్టార్టప్ సంస్కృతిలో ఐఐటి హైదరాబాద్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకొనే దిశగా ముందడుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రతినిధులు ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

# చైర్మన్ పదవి నల్లెల స్వాతి భరత్..? - మంత్రి సీతక్క ఆశీస్సులు నల్లెల్ల వారసత్వానికే

ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13 (భారత శక్తి):



ములుగు మున్సిపల్ నూతనంగా ఎన్నికలలో 20వార్డులకు గాను కాంగ్రెస్ పార్టీ 12 వార్డు కౌన్సిలర్లు గెలుపొందడంతో కాంగ్రెస్ పార్టీకి ఎదురులేకుండా మున్సిపల్ చైర్మన్ గిరి కాంగ్రెస్ కే దక్కింది.ములుగు మున్సిపల్ చైర్మన్ బిసి మహిళ రిజర్వేషన్ రావడం దివంగత కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్లెల కుమార స్వామి జిల్లాకు, మంత్రి సీతక్కకు ఉన్న ప్రత్యేక అనుబంధంతో మొదటి నుండి చైర్మన్ గిరి నల్లెలకె దక్కుతుందని ఖాయంగా అనిపిస్తుంది. మున్సిపల్ ఎన్నికలలో మొదటి నుండి చైర్మన్ నల్లెల కుటుంబానికే ప్రాధాన్యత ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ పీఠం కోసం బీసీలలో పోటీ చేసిన అభ్యర్థులు ఎక్కువమంది మహిళా అభ్యర్థులతోనే పోటీలో దిగారు. అందులో కాంగ్రెస్ పార్టీలో బిసి వర్గం నుండి ఐదుగురు అభ్యర్థులు పోటీలో నిలబడగా అందులో 8వ వార్డు కౌన్సిలర్ ఎన్నిక ప్రత్యేకతను సంతరించుకుంది. 8వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుండి నల్లెల స్వాతి భరత్,బిజెపి పార్టీ నుండి సిరికొండ సునీత బలరాం గట్టి పోటీ ఉన్నప్పటికీ నల్లెల స్వాతి భరత్ సునాయాసంగా విజయం సాధించించడం జరిగింది.ఈ గెలుపు దివంగత నేత నల్లెల కుమారస్వామి ఋణం తీర్చుకునేందుకు ప్రజలు ఇచ్చిన గెలుపుగా ప్రకటించారు.దీంతో మంత్రి సీతక్క నల్లెల స్వాతి భరత్ కుటుంబానికే ప్రాధాన్యత ఇస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.ఏదేమైనా మంత్రి సీతక్క ఆశీస్సులు నల్లెల స్వాతి భరత్ కే దక్కుతుందని, దాని కోసం రాజకీయ సమీకరణాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# స్పర్శ్ లేప్రోసిపై అవగాహన

మణుగూరు, ఫిబ్రవరి 13 (భారతశక్తి):



మున్సిపాలిటీలోని శివలింగాపురంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం బడుగులలో శుక్రవారం హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం తోగు, బుగ్గ గ్రామాల్లో డాక్టర్ నిశాంత్ రావు బృందంఇంటింటికి తిరిగి జాతీయ కార్యక్రమాలపై సర్వే చేస్తూ స్పర్శ్ లేప్రోసీపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. హెల్త్ చెకప్ చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం పేషంట్లకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీల్, సిబ్బంది వీరస్వామి, పరంగిణీ, సత్తెమ్మ, సూపర్ వైజర్ అనసూర్య, రాంప్రసాద్, కృష్ణ, సత్యనారాయణ, శ్రీకాంత్, సుజాత, ప్రియ భారతి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలు కాంగ్రెస్ హస్తగతం - ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన జగ్గారెడ్డి

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 13:





సంగారెడ్డి,సదాశివపేట మున్సిపల్ పీఠాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. రెండు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ అభ్యర్థులు ఘనమైన విజయాన్ని అందుకోవడం పై అభినందనలు తెలిపారు. అహర్నిశలు అభ్యర్థుల విజయం కోసం శ్రమించిన నాయకులు కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సీఎం రేవంత్ రెడ్డి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి ల సహకారంతో ఈ ఫలితాలను సాధించడం జరిగిందన్నారు. మున్సిపాలిటీల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాల అండగా ఉంటానని స్పష్టం చేశారు. ప్రజలకు అన్ని విధాల అందుబాటులో ఉండి రుణం తీర్చుకోవాలని అభ్యర్థులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి ఓట్లు వేసిన ప్రజలకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

# మానసిక ఆరోగ్యం మానవాభివృద్ధికి పునాది



దేశాభివృద్ధికి 'సౌభాగ్యానికి 'ప్రజారోగ్యంముఖ్యమైనది.ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ఆరోగ్యంఅంటేశారీరక మానసిక 'సాంఘిక ఆధ్యాత్మిక 'కుశలత అంతే కానీ కేవలం ఒక వ్యాధి గాని వైకల్యం కాని లేక పోవడం మాత్రమే కాదని పేర్కోవడం గమనార్హం.మానసికఆరోగ్యం ఆర్థిక వ్యవస్థలో ఉత్పాదక శక్తిని ఉత్పత్తినిపెంచుతుంది. మానసిక ఆరోగ్యంమానవాభివృద్ధి కి శ్రేయస్సుకు పునాదలాంటిది.మానవ జాతిలో శ్రామిక సామర్థ్యం ఇనుమడించిసమర్థవంతంగా పనిచేయడానికి దోహద పడుతుంది.

"ఆరోగ్య మే మహాభాగ్యం అనేది" సమాజం యొక్క జీవన విధానం కావాలి. ఆరోగ్యం బాగుంటెనే అంతా బాగుంటుంది. నేటి ఉరుకుల పరుగుల జీవన విధానంలో మానసిక ఆరోగ్యమే మహాభాగ్యం అంటున్నారు మానసిక వైద్య నిపుణులు. నాటి కాలాన్ని బట్టి పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. కాని ఇప్పటి పరిస్థితులు ఆస్తులు భౌతిక సంపదకై పెంపర్లాడే సంస్కృతి నెలకొంది .

"హైటెక్ యుగంలో మానవ జీవితం పరుగులమయమై పోటీ పోలికల వాతావరణం నెలకొన్నది. ఉదయం మేల్కొనప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఒకటే టెన్షన్ టెన్షన్ . బిజీ జీవితం కనీసం కుటుంబ సభ్యులతో సైతం గడుపలేని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. నేడు ఔత్సాహిక యువ తరంలో శారీరకసమస్యలతో పాటు మానసిక సమస్యల్లో వున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. కొందరు మానసిక సమస్యలు బయటకు చెప్పుకోలేక లోలోపల సతమతమౌతున్నారని ఆరోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి.

మారిన సామాజిక' ఆర్థిక సాంస్కృతిక 'సాంకేతిక మార్పుల వల్ల మానవులు ఒడిదొడుకులకు గురౌతున్నారు.కాలానికిఅనుగుణంగా అన్నివిషయాలలో మానవుడు వేగాన్ని పెంచాడు. అన్నిరంగాలలో సంపూర్ణ "పోలికత్వం " "పోటీతత్వం" పెరిగి పోయి భౌతిక సంపదపై మోజు పెరిగింది. అందరికంటె ఎక్కువ ఆర్థిక సంపద కలిగివుండాలన్న వాణిజ్య వాదంరాజ్యమేలుతుంది.భౌతిక సంపదపట్ల కాంక్ష పెరిగి బౌద్ధిక తాత్వికత తరిగి నైతికతక విలువలు క్షీణించి మానసిక ఆందోళన ఒత్తిడి మనిషి పాలిటి శాపంగా పరిణమించింది. ఈనేపథ్యంలో మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను సంతరించుకుంది .

జీవిత లక్ష్యాలను సాధించడానికి ఆనందంగా జీవించేందుకు శారీరక దారుఢ్యం తో పాటు మానసిక ఆరోగ్యం బాగుండేలాచూసుకోవాలి.ఇందుకు కావలసిన అవగాహన చైతన్యం ప్రజల్లో కలిగించి అప్రమత్తంగా ఉండేందుకు కార్యాచరణ ప్రణాళికలను రుపొందించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలి.

మానసిక ఆరోగ్యాన్ని అశ్రద్ధ చెసినచో చికిత్సను మధ్యలో ఆపి వేసిన అదుపు తప్పే ప్రమాదం వుంది. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు మానసిక ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యాన్ని తీవ్రంగాదెబ్బతీస్తుంది.మానవుడు శారీరక మానసిక ధారుఢ్యత పట్ల అప్రమత్తంగా ఉండేందుకు అవసరమైన ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. మానసిక రోగం సమస్యలు చెబితే చాలా మంది బయంతో వణికి పోతారు.మానసిక జబ్బుగురించిచర్చించడానికి చెప్పుకోవడానికిసంకొచిస్తారుతమలో తాము మదన పడి వ్యాధి తీవ్రతను పెంచుకునే ధోరిణి పెరిగిందని ఆరోగ్య సర్వేలు చెబుతున్నాయి.

2020 నాటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం 45 కోట్ల మంది ప్రజలు మానసిక దుర్బలత్వంతో 'వైకల్యంతో బాధపడుతున్నారు. భవిష్యత్తులో ఈ సమస్య తీవ్రమయ్యే సూచనలున్నాయని వైద్య 'ఆరోగ్య అద్యయనాలువెల్లడించాయిమానసిక ఒత్తిడి అనేది రెండవ అతిపెద్ద తీవ్రమైన వ్యాధిగా మారి ప్రజల మీద ఆర్థిక భారాన్ని మోపుతోంది.( ముర్రే అండ్ లోపెజ్) 1996 లో జరిపిన అధ్యయనం ప్రకారం అభివృధి చెందిన' అభివృధి చెందుతున్న దేశాలలో ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు తీవ్రమై మానసిక వ్యాధుల.వైద్య ఖర్చులు మోయలేని ఆర్థిక భారాన్ని కలిగిస్తుందని తన పరిశోధనలో చెప్పాడు.

మానసిక వైద్య నిపుణుల అంచనా ప్రకారం 40 శాతం మంది పిచ్చి వాళ్లే ఉన్నారని వైద్యారోగ్య సర్వేలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి సమాజములో 2.శాతం మంది మాత్రమేమానసికంగా ఫిట్ గా ఉన్నట్లు అంచనాలు తెలుపుతున్నాయి.మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసువారు ఉన్నారని ఈ వయసు నుంచి ఈ సమస్య ప్రారంభమౌతుందనీ ఆరోగ్య సర్వేలువెల్లడిస్తున్నాయి. .మొత్తం 20 శాతం మంది బాల బాలికల్లోఈఅవలక్షణం ఉన్నట్లు తేలింది.బాల్య దశలో కుటుంబాలలో జరిగిన హింస 'నిర్లక్ష్యం భయంకర సంఘటనలు సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వ సాధారణ కారణంగా మానసిక వైధ్యులు చెబుతున్నారు.

మన సమాజంలో వింత ప్రవర్తనలు వింత పోకడలు ఉన్న వ్యక్తులు కనిపి స్తుంటారు. ఒకరికి డబ్బు పిచ్చి' ఒకరికి తిండి పిచ్చి ' నగల పిచ్చి' ఆస్తుల సంపాదన పిచ్చి' సినిమాలు విపరీతంగా చూడడం' నటన పిచ్చి 'గొప్పలు చెప్పుకునే పిచ్చి' ఆడంబరాలకు పోయేపిచ్చి' వివిధ రకాల మానసిక రుగ్మతలు వున్న వారు మన చుట్టూ కనిపిస్తుంటారు. ఇతరులను అకారణంగా భాదించే షాడిస్ట్ వైఖరి వున్న వ్యక్తులు వుంటారని ఏదైనా అవథులు దాటిన అలవాటు లక్షణంపిచ్చికిందపరిగణిస్తారు.

మానసిక వైపల్యాల

వైద్య పరిభాషలో మానసిక వైపల్యాలు అనేక రకాలు గా పేర్కొంటారు. డిప్రెషన్ 'యంగ్సిటి "యాంగ్సిటి నురోసిస్ 'బైపోలార్ డిజార్డర్ సోషల్ 'యంగ్సిటీ డిజార్డర్పానిక్ డిజార్డర్ 'అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ 'పోస్ట్ ట్రామా టెక్ డిజార్డర్' ఫోబియా 'మానియా స్క్రిజోఫెనియ' డిల్లుషన్ డిజార్డర్ స్లీప్ డిజార్డర్ ' ఇన్ఫరియారిటీ కాంప్లెక్స్'సుపిరియారిటీ కాంప్లెక్స్ అడ్డిక్షన్ 'ఇల్లుషన్ 'లాంటి మానసిక వైకల్యాలు వుంటాయి. మానసిక ఉద్రిక్తతలను తగ్గించుకోక పోవడం వల్ల నిగ్రహశక్తి కోల్పోవడం వల్ల మానసిక రుగ్మతలుపెరుగుతున్నాయి కష్ట కాలంలో (సమయంలో) క్లిష్ట పరిస్థితుల్లో ఒత్తిడి కి లోనుకాకుండా కుంగి పోకుండా మనోధైర్యం తో ఆలోచనలు చేస్తే మెదడు సక్రమంగా పనిచేస్తుందని వైద్యులు సలహా మానసిక ఒత్తిడి విషవలయంలో పడకుండా ఓరుపు 'సహనం 'ప్రశాంతతనిగ్రహం.అలవరుచుకోవాలి.

మానసిక ప్రశాంతత జీవన శైలి

మానసిక ప్రశాంతత జీవన శైలిపై ఆదారపడి ఉంటుంది. రోజు వ్యాయామము మెడిటేషన్ 'సోషల్ ఇంటరాక్షన్ పౌష్ఠిక ఆహారం 'రిలాక్సేషన్ ఎక్సర్సైజ్ 'చేయాలి.మనసుకు హాయి నిచ్చే సంగీతం వినడం .భజన ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం. పెద్ద., సమస్యలు వచ్చినప్పుడు ఆందోళనకు గురికాకుండా కుంగి పోకుండా ఉద్రిక్తతలకు లోనుకాకండ మనసును దృఢంగా వుంచుకోవాలి.ప్రతి సమస్యకు పరిష్కారం వుందన్న విషయాన్ని బలంగా నమ్మాలి. మన పట్ల మనకు నమ్మకం వుండాలి. సహసంతో సమస్య పరిష్కార మార్గాలను అనుసరించాలి.ఇలా చేస్తే మానసిక రుగ్మతలు అనారోగ్య సమస్యలు మన దరి చేరవు.అని మానసిక వైద్యులు చెబుతున్నారు. క్లిష్టతరమైన సమస్యలు వస్తే తల మునకలు కాకుండా తోటి వారితో షేర్ చేసుకొని వారి సహాయం సలహా తీసుకుంటే ఆందోళన ఒత్తిడి తగ్గుతుంది. అందని వాటికి అర్రులు చాచడం నెరవేరని సాధ్యం కాని పనుల గురించి ఆలోచించడం మానుకోవాలి.ఆందోళన చెందకుండ మనసును దృఢంగా వుంచుకోవాలి.

వృద్ధుల్లో మానసిక కుంగు బాటు ఎక్కువ

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం నవ నాగరికత విదేశీ సంస్కృతి 'విదేశీ చదువులు' విదేశీ కొలువల పై పెరిగిన క్రేజీ వల్ల వృద్ధా ప్యంలో వుండే ఒంటరి తల్లి తండ్రుల సంఖ్య రోజురోజుకు పెరిగి పోయింది. ఆత్మీయత కరువై ఆంథొళన ఒత్తిడి వారికి శాపంగా పరిణమించింది ఈ స్థితి .వల్ల చాలా మంది వృద్దులుమానసికవ్యాధులతో ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆరోగ్య సర్వేలో తేలిన నిజం. వృద్ధులతో పాటు మధ్య వయసు వారిలో కూడా మానసిక వ్యాధులు వస్తున్నాయి.మానసిక చికిత్స కేంద్రాలకు వచ్చే వారిలో వృద్దులు 25 శాతం మంది ఉన్నారని సర్వేలో తేలింది. వృద్దులు ఎక్కువగా డిప్రెషన్ 'నిద్రలేమి 'ఆందోళన కుంగుబాటు' డిమెన్షియాలాంటి మానసిక రుగ్మతలతో ఆసుపత్రులకు వస్తున్నారు.వృద్ధా ప్యంలో మానసిక అనారోగ్యం కలుగకుండా జాగ్రత్తలు పాటించాలి. కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల ప్రేమ ఆదరణచూపించాలి . సకాలములో వైద్య ఆరోగ్య సలహాలు తీసుకొని చికిత్స చేయించుకోవాలి.

మానసిక సమస్యలు ఏర్పడితే వయసుతో సంబంధం లేకుండా సైక్రటిస్ట్( మానసిక వైద్యుని) వద్ద చికిత్స తీసుకోవాలి.

వాయిదా వేయడం మానుకోవాలి. సమాజం వేగంగాపరుగెడుతుంది.ఉరుకుల పరుగు ల జీవితం లో ఓర్పు' సహనం సమన్వయం 'అలవాటు చేసుకోవాలి. అల్ప కాలములో అత్యధిక ధనికులు కావాలని ప్రపంచాన్ని జయించాలని జీవితములో నిరంతరం పరుగులు పెడుతున్నారు. ఈ వేగములో పడి కుటుంబ సభ్యులను పట్టించుకోవడం లేదు.ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. బంధాలను అనుబంధాలను మరిచి పోతున్నారు."జీవితములో వేగం ఉండాలి కాని వేగమే జీవితం కాకూడదు" .కష్టాల్లో బాధల్లో మన వాళ్ళు ఆత్మీయులు తోడుంటే ఆ ధైర్యమే వేరుగా ఉంటుంది.

డబ్బులు పోతే మళ్ళీ సంపాదించవచ్చు .బంధాలు అనుబంధాలు తెంచుకుంటే తిరిగి రావు.వ్యసనాలకు స్వస్తి చెప్పి నవ్వుతూ నవ్విస్తూ జీవిస్తే ప్రశాంతత చేకూరి మానసిక సమస్యలు రావు.కష్టాలు సమస్యలు బాధలు మన జీవితములో అంతర్భాగాలు అవి వుంటూ ఉంటాయి. వాటితో సహజీవనం చెయ్యల్సిందే .వాటికి భయపడకుండా మనోధైర్యం తో ఎదురుకోవాలి. చింతన మానుకొని ప్రశాంతతను పెంచుకొని శాంతియుత జీవనం కొనసాగిస్తే మానసిక ఆరోగ్యం మన సొంతమవుతుంది. మన ఆరోగ్యం మన చేతుల్లోనే వుంది .మానసిక ఆరోగ్యమే మహాభాగ్యము అనేది మన జీవన శైలి కావాలి.

ప్రభుత్వాలు బికృషి

మానసిక ఆరోగ్య విధానాలు కేవలం మానసిక వైకల్యాలు పరిమితంకాకూడదు."మానసిక ఆరోగ్యమే" లక్ష్యంగా వైద్య ఆరోగ్య విధానాలు రూపొందించాలి.ప్రపంచ ఆరోగ్య సంస్థ సభ్య దేశాల వైద్య ఆరోగ్య విధానాలను సమన్వయం చేసుకుంటూకాలానుగుణంగా వస్తున్న వైద్య విధానాల పట్ల అవగాహన చైతన్యం కలిగిస్తుంది. వివిధ ప్రభుత్వాలు అమలుచేస్తున్న వ్యూహాలను ప్రణాళికలను ఏకీకృతం చేస్తూ సంఘటిత పరుస్తోంది .మానసిక ఆరోగ్యం కోసం ప్రభుత్వ సమాజం సమిష్టి కృషి చెయ్యాలి.భవిష్యత్ మానవ వనరులైన పిల్లల మనో వికాసానికి చేయూతను ఇచ్చే కార్యాచరణకు పూనుకోవాలి.పిల్లల పెంపకం 'చైల్డ్ సైకాలజీ 'అంశాల మీద టీచర్స్ కు తల్లి తండ్రులకు అధ్యాపకులకు "శిక్షణ కేంద్రాలు"ఏర్పాటుచెయ్యాలి. మానసిక ఆరోగ్యం పట్ల యూనివర్సిటీలలో

అధ్యయనం పరిశోధనకు ప్రభుత్వం బడ్జెట్ కెటాయించాలి.పేదరికం "నిరుద్యోగం 'ఆర్థిక అసమానతలు 'ప్రాంతీయ అసమానతలు 'సామాజిక అంతరాలు స్త్రీ 'పురుష 'లింగ వివక్షత 'ఉమెన్ ట్రాఫికింగ్ ' బాలకార్మిక వ్యవస్థ 'వెట్టి చాకిరి మొన్నగు సామాజిక 'ఆర్థిక సమస్యలను పరిష్కరించి

జీవన భద్రత 'భరోసాకు కావలసిన సామాజిక ,'ఆర్థిక రాజకీయ వాతావరణం ప్రభుత్వాలు కలిపించాలి.

సాంఘికంగ.ఆర్థికంగా మహిళలకు సాధికారిత కలిపించాలి.వయోవృద్దులకు సాంఘిక సహాయాలు అందించడం డే సెంటర్స్ "ఓల్డ్ ఏజ్ హోమ్స్" నేలకొల్పాలి.పాఠశాలలో మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే పాఠ్యాంశాలు ప్రవేశ పెట్టాలి. మనో వికాసం మనోధైర్యం పెంచే కార్యక్రమాలలో విద్యార్థులను భాగ స్వాములను చెయ్యాలి.

పనిచేసే చోట మానసిక ఆరోగ్య సంరక్షణ కొరకు "కౌన్సిలింగ్ కేంద్రాలు"నెలకొల్పి సుశిక్షితులైన వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చెయ్యాలి . ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం అద్వేర్యములో

మురికి వాడల్లో గ్రామీణ ప్రాంతాలలో ఉచిత మానసిక ఆరోగ్య శిబిరాలు ప్రభుత్వం నిర్వహించాలి.

ప్రజలకు మౌలిక సదుపా యాలు గృహ వసతి 'విద్య' వైద్య 'రవాణా సౌకర్యాలు ఏర్పాటుచేసి వారిలో ఆత్మగౌరవాన్నిపెంపొందించాలి.

సమాజములో ఉద్రిక్తతలు హింసాత్మక సంఘటనలు జరుగకుండ ప్రభుత్వం శాంతి భద్రతలు ' సంరక్షించే చర్యలు చేపట్టాలి.వ్యాయామము 'మెడిటేషన్ యోగఉదయం వాకింగ్ 'జాగింగ్ సైక్లింగ్ స్విమ్మింగ్' షటిల్ 'బ్యాడ్మింటన్ లాంటి క్రీడల్లో పాల్గొనాలి పబ్లిక్ 'ప్రైవేట్ 'రంగాలలో పట్టణాలలో' గ్రామాలలో' పబ్లిక్ పార్కులను 'రిక్రియేషన్ సౌకర్యాలను ఏర్పాటు చెయ్యాలి.ప్రభుత్వం 'స్థానిక సంస్థలు విద్య సంస్థలు 'మహిళా యువజన సంఘాలు 'సామాజిక సాంస్కృతిక స్వచంద సంస్థలు' పౌరసమాజం మానసిక ఆరోగ్య అక్షాస్యత పరి వ్యాప్తికి చిత్త శుద్ది తో కృషి చేసిమానసిక ఆరోగ్యమే మహాభాగ్యము అన్నది నినాదం కాకుండా విధానంగా వర్ధిల్లాలి.

నేదునూరి కనకయ్యఅధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరంసామాజిక.ఆర్థిక అధ్యయన వేదిక 9440245771 హైదరాబాద్

## ఆంగ్ల భాషా దినోత్సవం ఘనంగా నిర్వహణ -- ఆంగ్ల ఉపాధ్యాయునికి సన్మానం

ఆదిలాబాద్ జిల్లా, ఫిబ్రవరి 13 (భారత శక్తి )

అదిలాబాద్ జిల్లా స్థానిక అర్బన్ రేడియన్సినల్ స్కూల్లో ఆంగ్ల భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ ఎం ఒ అజయ్ హాజరై, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

ఈ సందర్భంగా ఆంగ్ల బోధనలో విశేష కృషి చేస్తున్న మార రవికాంత్ రెడ్డిను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. సన్మానం స్వీకరించిన ఆయన మాట్లాడుతూ, "ఆంగ్ల భాషా దినోత్సవం సందర్భంగా నన్ను సన్మానించిన నా సహచర ఉపాధ్యాయులకు మరియు అజయ్ సార్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ ప్రోత్సాహం, మద్దతు నాకు మరింత ప్రేరణనిస్తుంది" అని తెలిపారు.కార్యక్రమంలో ప్రసంగాలు, పదజాల ఆటలు, క్విజ్ పోటీలు, పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకలో పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, రాజన్న, హారికతో పాటు బోధనేతర సిబ్బంది దత్తు, రుతిక, స్వప్న, వీణ, రజిత తదితరులు పాల్గొన్నారు.

## గుట్ట మున్సిపల్ 'హస్త'గతం

**– కాంగ్రెస్ 8, సిపిఐ 1 స్థానాల్లో గెలుపు**

**–అనూహ్యంగా బిజెపికి రెండు సీట్లు**

**– కేవలం ఒక స్థానానికే పరిమితమైన బిఆర్ఎస్**

యాదాద్రి భువనగిరి, భారత శక్తి జిల్లా ప్రతినిధి, (ఫిబ్రవరి 13): ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పక్కా వ్యూహంతో యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ఖాతాలో చేరిపోయింది. మొత్తం 12 స్థానాలకు గానూ 10 వ వార్డు ఏకగ్రీవం కాగా 11 వార్డులకు ఎన్నికలు జరిగాయి. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ 7, సిపిఐ 1 స్థానాల్లో గెలుపొందగా బిజెపి తొలిసారి 2 స్థానాల్లో గెలిచి సంచలనం నమోదు చేసింది. యాదగిరిగుట్ట తొలి మున్సిపాలిటీ చైర్మన్ పీఠం చేజిక్కించుకున్న బిఆర్ఎస్ ఈ సారి కేవలం ఒకే ఒక్క సీటుతో సరిపెట్టుకోవలసి వచ్చింది. అదేవిధంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తన అంతర్గత సర్వే ప్రకారం అభ్యర్థుల పని తీరు, ఆర్థిక పరిస్థితులు, సామాజిక అంశాల ప్రకారం కేటాయించిన సీట్లలో చాలా వరకు అభ్యర్థులు గెలిచారు. మున్సిపాలిటీలోని 7వ, 9వ వార్డు మినహా ఏ వార్డులోనూ బిఆర్ఎస్ అభ్యర్థులు కాంగ్రెస్ అభ్యర్థులకు గట్టి పోటీ కూడా ఇవ్వలేకపోయారు. ఈ ఎన్నికల్లో మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి చాణక్యత ఏ మాత్రం పని చేయలేదు, ముందుగా 10వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి ఆవుల మమత సాయి యాదవ్ నామినేషన్ ఉపసంహరించుకోవడంతోనే సగం మంది బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ప్రశ్నార్థకంగా మారింది. కాంగ్రెస్ పార్టీలోనూ ఎలాంటి రెబల్స్ బెడద లేకుండా ముందుగానే చైర్మన్, వైస్ చైర్మన్ అభ్యర్థులను కూడా ప్రకటించి ఆ దిశగా చైర్మన్ పీఠం గెలుపు కోసం పక్కా వ్యూహంతో పని చేసి సాధించారు.

## ప్రజాపాలనకు నిదర్శనం మున్సిపల్ ఫలితాలు

### బిఆర్ఎస్, బీజేపీలు కలిసి వచ్చినా కాంగ్రెస్ విజయాన్ని ఆపలేకపోయాయి –ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదాద్రి భువనగిరి,భారత శక్తి జిల్లా ప్రతినిధి (ఫిబ్రవరి 13): రాష్ట్రంలో ప్రజాపాలనకు మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పే నిదర్శనం అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షుడు బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం మున్సిపల్ ఎన్నికల ఫలితాల సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థులతో కలిసి మీడియాతో మాట్లాడారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, యువతకు అవకాశాలు కల్పించడం, ముఖ్యంగా తెలంగాణలో మహిళలకు పెద్దపీట వేసిన ప్రభుత్వంగా మా ప్రభుత్వం నిలిచిందన్నారు. అందుకే ఈ ఎన్నికల్లో మహిళలు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపారని ఈ విజయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలోని ఆరుకు ఆరు మున్సిపాలిటీలను భారీ మెజారిటీతో గెలిపించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా ఆలేరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి విశేష ఆదరణ లభించింది. బీఆర్ఎస్, బీజేపీలు కలిసి వచ్చినా కూడా ఎక్కడా పోటీ ఇవ్వలేకపోయాయి అంటే ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల విశ్వాసం స్పష్టంగా తెలుస్తోందని తెలిపారు. ఈ నమ్మకంతోనే జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలను ముఖ్యమంత్రి సహకారంతో భారీ స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో చేసిన పనులను చూసి ప్రజలు మాకు ఈ గొప్ప విజయాన్ని అందించారు. అదేవిధంగా రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కూడా 90 శాతం పైగా సీట్లు గెలుచుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ విజయానికి సహకరించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## 'కపుల్ ఫ్రెండ్లీ'తో తెరపైకి
# తెలంగాణ బ్యూటీ!



తెలుగు తెరపై ఈ మధ్య కాలంలో తెలుగు హీరోయిన్స్ జోరు పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న దర్శకులు, కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఎక్కువ ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ఓ మాదిరి బడ్జెట్ సినిమాల ద్వారా పరిచయమవుతున్న ఈ కథానాయికలు, ఆ తరువాత తమ టాలెంట్ తో నిలదొక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆంధ్ర నుంచి మాత్రమే కాదు, ఇటు తెలంగాణ వైపు నుంచి కూడా పరిచయమవుతున్న హీరోయిన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వరంగల్ నుంచి తెలుగు తెరకి పరిచయమైన ఆనంది, తమిళంలో స్టార్ డమ్ ను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగులో సినిమాలు చేస్తోంది. ఈషా రెబ్బా కూడా తనదైన స్టైల్లో సినిమాలు .. సిరీస్ లు చేస్తూ వెళుతోంది. ఇక వైష్ణవి చైతన్య 'బేబీ' సినిమాతో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'మానస వారణాసి' పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అందాల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో అలరించనుంది. మానస వారణాసి ఇంతకు ముందు ఒక సినిమా చేసినప్పటికీ, కొన్ని కారణాల వలన అది ఆడియన్స్ కి రీచ్ కాలేదు. 'కపుల్ ఫ్రెండ్లీ' మాత్రం రిలీజ్ కి ముందే మంచి బజ్ తెచ్చుకుంది. 'వాలెంటైన్స్ డే' సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తూ ఉండటంతో, యూత్ అంతా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ ఎమోషన్స్ తో పాటు, పొయెటిక్ గా అనిపించేలా రొమాన్స్ ఉంటుందని చెప్పడం యూత్ ను ఎక్కువగా ఆకర్షిస్తోంది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, సంతోష్ శోభన్ జోడీగా మానస వారణాసి తొలి హిట్ కొడుతుందేమో చూడాలి మరి.

# డబ్బు పెద్ద జబ్బు..
## వందల కోట్లు పోయినా ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నా
: జగపతిబాబు



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతి బాబు హీరోగా, విలన్‌గా, ఎన్నో కీలక పాత్రల్లో మెప్పించిన సంగతి తెలిసిందే. సాధారణ జీవితాన్ని ఇష్టపడే ఆయన... తనది ఎన్నో ఎత్తులు, లోతులు చూసి మళ్లీ నిలబడిన జీవిత కథ అని చెబుతుంటారు. తాజాగా ఓ ప్రముఖ పాడ్‌కాస్ట్ షోలో ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా డబ్బు గురించి ఆయన చెప్పిన మాటలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. జగపతి బాబు మాట్లాడుతూ... మనం డబ్బు వెంట పరిగెత్తకూడదని, అదే మన దగ్గరికి వచ్చేలా ఉండాలని సూచించారు. డబ్బు కేవలం అవసరాలను తీర్చే సాధనమేనని, ఒకప్పుడు స్టార్ హీరోగా ఉండి ఆ తర్వాత ఆర్థికంగా ఎన్నో ఒడిదుడుకులు చూసిన తనకు దాని విలువ బాగా తెలుసని చెప్పారు. ఈ రోజుల్లో మనిషి కంటే డబ్బుకే ఎక్కువ విలువ ఇస్తున్నారని, ఇది సమాజానికి చాలా ప్రమాదకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు పిచ్చి అనేది పెద్ద జబ్బు అని, దాని కోసం ప్రాణ స్నేహితులను, బంధువులను దూరం చేసుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. తాను వందల కోట్ల ఆస్తులు పోగొట్టుకున్నప్పటికీ ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నానని చెప్పారు. ప్రశాంతమైన నిద్ర, మంచి ఆహారం, ప్రేమగా పలకరించే మనుషులు ఉండటమే నిజమైన ఆస్తి అని తెలిపారు. డబ్బు కోసం అబద్ధాలు ఆడటం, వేషాలు వేయడం కంటే ఉన్నదానితో తృప్తిగా బతకడం మేలు అని జగపతి బాబు సందేశం ఇచ్చారు.

# సినిమా

# శివ రామ్, అన్వీరా దేవి



రామ్ చరణ్ ఉపాసన దంపతులకు గత జనవరి 31న కవల పిల్లలు పుట్టిన విషయం తెలిసిందే. వారికి ఒక బాబు, పాప జన్మించగా ఈ నెల 11న చిన్నారులకు బారసాల కార్యక్రమం జరిగింది. అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య పూజా కార్యక్రమం నిర్వహించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పిల్లల పేర్లు వెల్లడించాడు చెర్రీ. అబ్బాయి పేరు శివరామ్, అమ్మాయి పేరు అన్వీరా దేవి అని పెట్టినట్లు తెలిపాడు. ఇక వారికి ఆ పేర్లు పెట్టడానికి గల కారణాలను కూడా వివరించాడు. పిల్లల పేర్ల కోసం దంపతులిద్దరూ చాలా ఆలోచించారట. వినగానే ఆధ్యాత్మిక భావం కలిగేలా ఉండాలనుకున్నారట. తల్లిదండ్రుల సలహాలు తీసుకుని శివుడు, రాముడు పేర్లు కలసి వచ్చేలా.. చిరు అసలు పేరు శివ శంకర వర ప్రసాద్ కూడా కలిసేలా అబ్బాయి పేరు పెట్టారట. కుమార్తె పేరు అన్వీరా దేవి(అన్= అపరిమితమైన, వీర= ధైర్యం, దేవీ=దైవిక శక్తి) గురించి చెబుతూ అపరిమితమైన ధైర్యాన్ని, దైవిక శక్తిని సూచించేలా నామకరణం చేసినట్లు తెలిపాడు.

# హిట్ పడితే చాలు..



సంతోష్‌శోభన్, మానస వారణాసి జంటగా నటించిన తాజా చిత్రం కపుల్ ఫ్రెండ్లీ. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించాడు. మ్యూజికల్ రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన ఈ మూవీ ఈ నెల 14న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో పాల్గొన్న అనిల్ రావిపూడి సంతోశ్ శోభన్ పై ప్రశంసలు కురిపించాడు. 'మంచి ఫీచర్స్ ఉన్నాయి. బాగా నటిస్తాడు. మంచి వాయిస్ ఉంది. హీరోకు కావాల్సిన అన్ని లక్షణాలు ఆయనకు ఉన్నాయి. మంచి హిట్ పడితే చాలు గొప్ప స్థాయికి వెళ్తాడు' అన్నాడు.

# కంటెంట్ ఉన్న పాత్రలు

సంయుక్త మీనన్ కు మలయాళ సినీ ఇండస్ట్రీలో ఇప్పటికే మంచి గుర్తింపు ఉంది. అక్కడ చేసిన విభిన్న పాత్రల ద్వారా తన నటనా సామర్థ్యాన్ని ఋజువు చేసుకున్న ఆమె ఇప్పుడు టాలీవుడ్ లోనూ అదే దిశగా అడుగులు వేస్తుంది. గ్లామర్ కంటే యాక్టింగ్ ఓరియెంటెడ్ సినిమాలనే చేసుకుంటూ కెరీర్‌లో ముందుకెళ్తుంది. రీసెంట్ గా శర్వానంద్ నటించిన నారీ నారీ నడుమ మురారి సినిమాలో ఆమె పాత్ర పెద్దది కానప్పటికీ, తెరపై కనిపించిన ప్రతీ ఫ్రేమ్‌లోనూ స్పెషల్ ఇంపాక్ట్ చూపించింది. కళ్లలో ఆకర్షణ, ఎమోషన్స్ ను పలికించడంతో పాటూ మంచి డైలాగ్ డెలివరీ.. ఈ మూడు అంశాలు సినిమాలో ఆమె క్యారెక్టర్‌ను హైలైట్ చేశాయి. కథలో భాగంగా మాత్రమే కాకుండా సీన్ కు బలం చేకూర్చే నటిగా ఈ భామ నటించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా వచ్చిన స్వయంభు టీజర్ లో నభా నటేష్ గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ, సంయుక్త మాత్రం యోధురాలిలా కనిపిస్తూ తనదైన ముద్ర వేసింది. టీజర్ లో ఆమె లుక్, బాడీ లాంగ్వేజ్, యాక్షన్ షాట్స్ లో కనిపించిన తీరు ఇవన్నీ హైలైట్ గా నిలవగా, గ్లామర్ కు భిన్నంగా, కంటెంట్ ఆధారంగా నిలిచే పాత్రలను ఎంచుకుంటూ ఆమె సైలెంట్ గానే తన కెరీర్ గ్రాఫ్ ను పెంచుకుంటుంది.



# రణవీర్ సింగ్ ను చంపేస్తామంటూ బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరింపులు

బాలీవుడ్ లో ప్రముఖ నటుడు రణ్ వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్ వీర్ ను, అతడి వద్ద పనిచేస్తున్న వారినీ చంపేస్తానని దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టికి కూడా ఇదే తరహా బెదిరింపులు చేశాడు. ఈ మేరకు వాట్సాప్ లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ మెసేజ్ తో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. తన డిమాండ్లను అంగీకరించకపోతే వారితో పాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు.



**మెసేజ్ లో ఏముందంటే..**

''రణ్ వీర్ సింగ్.. నీ భవిష్యత్తులో ఏడు తరాలు గుర్తుండిపోయేలా నిన్ను హత్య చేస్తాం. నువ్వు మా బెదిరింపులను లెక్క చేయకపోగా మిగతా వారికీ ఉచిత సలహాలు ఇస్తున్నావు. పోలీసులకు ఫిర్యాదు చేసేలా వారిని ప్రోత్సహిస్తున్నావు. నువ్వు కూడా ఓ కంప్లైంట్ చేసినట్టున్నావు.. పర్వాలేదు. ఇక నీకు మామూలుగా చెప్పం. నీ దగ్గర ఎవరెవరు పనిచేస్తున్నారు. వారు ఎప్పుడు వస్తారు, ఎప్పుడు వెళతారు.. వారి కుటుంబాలు ఎక్కడ ఉంటున్నాయనే వివరాలు మొత్తం మా దగ్గర ఉన్నాయి. వారితో మొదలు పెడతాం. ఒక్కొక్కరినీ టార్గెట్ చేసి చంపేస్తుంటే అప్పుడు నీకు తెలిసివస్తుంది. నీకు ఇంకా టైముంది. హత్యలు మొదలయ్యే లోపే మేలుకో'' అంటూ దుండగుడు బెదిరించాడు.







# చిట్టిపొట్టి సక్యులెంట్లు... చూడముచ్చటగా!

**ఇంట్లో ఎంత ఖరీదైన వస్తువులు తెచ్చిపెట్టినా... మొక్కలు తెచ్చే అందమే వేరు. అందులోనూ తక్కువ నిర్వహణతో వైవిధ్యంగా పెరిగేవి అయితే మరింత కళగా అనిపిస్తాయి. అలాంటివాటిల్లో సక్యులెంట్లు ఒకటి. వీటి ప్రత్యేకతలు ఏంటో? వీటినెలా పెంచుకోవాలో తెలుసా?**

లక్షల సంవత్సరాలుగా మనుగడలో ఉన్న మొక్కల్లో సక్యులెంట్లు ఒకటి. ఆకులు, కాండం లేదా వేర్లలో నీటిని నిల్వ చేసుకుని పొడి వాతావరణంలోనూ సులువుగా బతికేస్తాయివి. తక్కువ నిర్వహణతో ఇంటి అందాన్ని రెట్టింపు చేస్తాయి. ఇవి అవుట్‌డోర్లలోనూ బాగానే పెరిగినా.. ఇండోర్ ప్లాంట్స్‌గా చాలా పాపులర్. చిట్టి, పొట్టి రకాలుగా... అరచేతిలో ఇమిడిపోతూ, కుండీల్లో ఒదిగిపోతూ భలే ముచ్చటగొలుపుతాయి. మందంగా నిగనిగలాడే వీటి ఆకులు, రంగులు ఆకట్టుకుంటాయి.

ముఖ్యంగా ఆఫ్రికా, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా వంటి పొడి ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. 18,19వ శతాబ్దాల్లో యూరోపియన్ వృక్ష శాస్త్రవేత్తలు వీటిని ప్రపంచానికి పరిచయం చేశారు. ఆధునిక కాలంలో ఇండోర్ గార్డెనింగ్ ట్రెండ్‌తో మరింత పాపులర్



అయ్యాయి. సక్యులెంట్స్‌లో వేలాది రకాలు ఉన్నాయి. అలోవెరా, జేడ్, ఎకవేరియా, హావోర్తియా, సెడమ్, కాలంచో వంటివి ప్రముఖమైనవి. ఇవి సాధారణంగా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. కానీ, సూర్యకాంతి, ఉష్ణోగ్రత, ఒత్తిడి వల్ల ఎరుపు, ఊదా, నీలం, గులాబీ, నారింజ రంగుల్లోకి మారతాయి. ఈ వర్ణాలు వాటిని మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి.

**ఎలా పెంచాలి...**

సక్యులెంట్లను నాటుకునేందుకు నీరు నిలవని, ఇసుక కలిపిన సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. ఇది పూర్తిగా పొడిగా అయ్యాకే నీళ్లు పోయాలి. ఎక్కువ పోస్తే వేర్లు కుళ్లిపోతాయి. అలానే ఎరువులను కూడా వీలైనంత తక్కువగా అందించాలి. నెలకోసారి 5 10 10 నిష్పత్తిలో సమగ్ర ఎరువుని ఇస్తే సరి. ఎక్కువైతే ఆకులు పొడవుగా పెరిగి పాడవుతాయి. ఈ మొక్కలను సాధారణంగా తెల్లదోమ, పేనుబంక, స్పైడర్ మైట్స్... వంటివి వేధిస్తాయి. క్రమం తప్పకుండా పరీక్షించి... వ్యాధి సోకిన మొక్క లేదా కొమ్మను వేరు చేయాలి. వేపనూనెను నీటిలో కలిపి



చల్లాలి. గాలి బాగా ప్రసరించేలా చేయాలి. ఇవి నేరుగా తగిలే ఎండలో కంటే... ప్రకాశవంతంగా ఉండే పరోక్ష కాంతిలో చక్కగా పెరుగుతాయి. ఆకులూ, కొమ్మ కత్తిరింపుల ద్వారా కొత్త మొక్కల్ని సులభంగా పెంచవచ్చు. సక్యులెంట్స్ గాలిని శుద్ధి చేయడంతో పాటు మానసిక ఒత్తిడినీ తగ్గిస్తాయి.

# అతి వద్దు సుమీ!

**అమ్మాయిలకు అందంపైనా, ఆరోగ్యంపైనా స్పృహ రోజు రోజుకీ పెరుగుతోంది. దీంతో తక్కువ సమయంలోనే బరువు తగ్గాలని కొందరు... దృఢంగా మారిపోవాలని మరికొందరు అతిగా వ్యాయామాలు చేస్తున్నారు. ఇలా చేస్తే ప్రయోజనాల సంగతి దేవుడెరుగు... దుష్ప్రభావాలు తప్పవంటున్నారు నిపుణులు. అది ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో తెలుసా?**



**ఒత్తిడి పెరుగుతుంది...**

వ్యాయామం చేయడం వల్ల ఫీల్‌గుడ్ హార్మోన్లు విడుదలై ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తాయి. అయితే, మితిమీరి వర్కవుట్స్ చేయడం వల్ల కార్టిసాల్ అనే స్ట్రెస్ హార్మోన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. దీంతో శరీరమే కాదు... మనసూ అలసిపోతుంది. కాబట్టి తీసుకునే ఆహారాన్ని బట్టి రోజూ 45 నిమిషాల నుంచి గంట వరకూ కసరత్తులకు కేటాయించుకుంటే సరిపోతుంది.

**ఎక్కువ తినేలా చేస్తుంది...**

అధిక వ్యాయామం వల్ల గ్రెలిన్ వంటి ఆకలి హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. దీంతో కసరత్తులతో కరిగించిన కెలోరీలు కంటే ఎక్కువగా ఆహారం తీసుకునేలా చేస్తాయి. దీంతో నాజూగ్గా మారాలన్న లక్ష్యం పక్కకెళ్లి... మరింత బరువు పెరిగే ప్రమాదం ఉంది.

**హార్మోన్ల హెచ్చుతగ్గులు...**

మితంగా చేసే వ్యాయామం... హార్మోన్లను సమతుల్యం చేస్తుంది. అదే విశ్రాంతి లేకుండా అతిగా చేస్తే శరీరంపై ఒత్తిడి పెరిగి అవి హెచ్చుతగ్గులకు గురవుతాయి. ముఖ్యంగా కార్టిసాల్ ఎక్కువగా ఉత్పత్తి అయ్యి ఇతర హార్మోన్లను దెబ్బతీస్తుంది. ఈస్ట్రోజన్, ప్రొజెస్టరాన్ తగ్గుతాయి. నెలసరిని క్రమం తప్పిస్తాయి. భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వంటి వ్యాధుల బారిన పడేలానూ చేస్తాయి. కాబట్టి ఆ సమయం గంట దాటకుండా ఉంటే మేలు.


# వంటింట్లోనూ క్రోషె అందాలు..!

**ఓర్పు, సృజనాత్మకత కలగలిపి చేసిన క్రోషె అందాల్ని చూసి ముగ్ధులవ్వని వాళ్లు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. అందుకే చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ క్రోషెతో అల్లిన గౌన్లు, స్వెటర్లు, కోట్‌లు వేసుకుని మురిసిపోతుంటారు. కొన్ని ప్రాంతాల్లో అయితే గర్భం దాల్చిన వెంటనే గర్భస్థ శిశువుకు క్రోషె దుస్తులు అల్లడం ఓ సంప్రదాయంగానూ భావిస్తారు. ఈ అల్లికలో ఉన్న అందం, సౌకర్యం, మృదుత్వమే ఇందుకు కారణం. మరి ఇంత చరిత్ర ఉన్న ఈ అల్లికల్ని కేవలం దుస్తులకో, ఏదో ఒక ప్రాంతానికో పరిమితం చేయడం సబబు కాదు అనుకున్నారో ఏమో తయారీదారులు... మొక్కల దగ్గర్నుంచీ పడకగది, హాల్, బాల్కనీ అన్నీ దీంతో తయారుచేసిన అలంకరణ వస్తువులతోనే నింపేస్తున్నారు. ఇప్పుడు ఈ క్రోషె అందాలు వంటింట్లోకీ వచ్చేశాయి. టీ కప్పులకు అలంకరణ వస్త్రం, సరకుల్ని ఉంచే బాక్సులు, స్పూన్లు-గరిటెలు పెట్టుకునే ఆర్గనైజర్లు, పండ్లు కూరగాయలు సర్దుకునే బ్యాగులు... ఇలా చెప్పకొంటూ పోవాలే కానీ... వంటిల్లు మొత్తం క్రోషె అందాలతో నింపే పనిలో పడ్డారు. వీటిల్లో ఎక్కువ శాతం వేలాడదీసే డిజైన్లే. కాబట్టి స్థలాభావ సమస్యే ఉండదు. గాజు, సెరామిక్ వంటి వాటితో పోలిస్తే మన్నిక కూడా ఎక్కువే. అంతేనా... అందానికి అందం, సౌలభ్యం కూడా. మినిమలిస్టిక్ డిజైన్లు మెచ్చే వాళ్లకి ఇవి మంచి ఎంపిక. మీకూ నచ్చాయా. ఆన్‌లైన్ వేదికల్లో వెతికేయండి మరి!**
















# చదువులకు కాలుష్యం దెబ్బ

**పిల్లలు బాగా చదువుకోవాలని, అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలని తల్లిదండ్రులంతా కోరుకుంటారు. చదువుల మీద ధ్యాస చూపితేనే ఇది సాధ్యం. ఇందుకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి చాలా ముఖ్యం. వీటి కోసం రకరకాల ప్రయత్నాలు చేసి ఉంటారు. పర్యావరణ పరిశుభ్రత, ఆహారంలో యాంటీఆక్సిడెంట్ల మీదా ఓసారి దృష్టి సారించండి. ఇవి పిల్లల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మీద ప్రభావం చూపుతున్నట్టు బీఎంసీ పబ్లిక్ హెల్త్‌లో ప్రచురితమైన తాజా**





ఇందులో ఆక్సీకరణ ఒత్తిడి ఉమ్మడిగా ప్రభావం చూపుతున్నట్టు భావిస్తున్నారు. అయితే ఆహారం, కాలుష్యం రెండూ కలిసి ఎలాంటి ప్రభావం చూపుతున్నాయో తెలియదు. అందుకే తాజా అధ్యయనంలో దీనిపై దృష్టి సారించారు. వాయు కాలుష్యం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో నివసించే పిల్లల్లో ఏకాగ్రత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. స్వచ్ఛమైన పర్యావరణం స్థాయిలో కాకపోయినా యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా గల ఆహారంతోనూ ఏకాగ్రత పెరుగుతున్నట్టు బయటపడింది. అంటే ఆహారం కన్నా వాయు కాలుష్యమే విషయగ్రహణ సామర్థ్యం తగ్గటంపై ఎక్కువ ప్రభావం చూపుతోందన్నమాట.

పిల్లల విషయగ్రహణ సామర్థ్యం పెంపొందటంలో స్వల్పకాల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత గణనీయమైన ప్రభావం చూపుతాయి. చదువుకోవటం, చదువుల్లో రాణించటానికివి చాలా ముఖ్యం. మున్ముందు జీవితంలో పైకి ఎదగటానికి తోడ్పడతాయి. సమాచారాన్ని కొంతకాలం మరవకుండా ఉండటానికి స్వల్పకాల జ్ఞాపకశక్తి ఉపయోగపడితే.. పనులను పూర్తిచేయటానికి, తప్పులు చేయకుండా ఉండటానికి స్థిరమైన ఏకాగ్రత దోహదం చేస్తుంది. ఇవి గతి తప్పితే తెలివితేటలు ఉన్నప్పటికీ చదువుల్లో రాణించటం తగ్గుతుంది. విషయగ్రహణలో చిక్కులకు పర్యావరణ విషతుల్యాలు, పోషకాల లేమి వంటివి కారణమవుతున్నట్టు గత పరిశోధనలు చెబుతున్నాయి. అత్యవసర యాంటీఆక్సిడెంట్లు, సూక్ష్మపోషకాల లేమితో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తగ్గుతున్నట్టు.. పండ్లు, చేపలు, కూరగాయలు ఎక్కువగా గల ఆహారం తినటం మేలు చేస్తున్నట్టు తేలింది. అలాగే నాడీ వ్యవస్థ సరిగా వృద్ధి చెందకపోవటానికి గాలి కాలుష్యం అతిపెద్ద పర్యావరణ ముప్పు కారకంగా పరిణమిస్తున్నట్టు వెల్లడైంది. ముఖ్యంగా కాలుష్యం ఎక్కువగా గల పట్టణ ప్రాంతాల్లో నివసించే పిల్లల్లో ఇలాంటి ధోరణి కనిపిస్తోంది.

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి 'భరోసా'



* **జీహెచ్ఎంసీ ప్రత్యేక చొరవ.. ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు**
* **మొబైల్ బస్సుల ద్వారా క్షేత్రస్థాయిలోనే పరీక్షలు**
* **20 సర్కిళ్లలో పూర్తి.. 'కార్కినోస్' భాగస్వామ్యంతో మహత్తర కార్యం**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : నగర పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) 'మొబైల్' యుద్ధం ప్రకటించింది. చాపకింద నీరులా విస్తరిస్తూ ప్రాణాంతకంగా మారుతున్న క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే తుడిచిపెట్టేందుకు నడుం బిగించింది. 'కార్కినోస్ హెల్త్ కేర్' భాగస్వామ్యంతో, ఇండియన్ క్యాన్సర్ సొసైటీ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు కార్మికుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నాయి.

**ముందస్తు గుర్తింపే.. ప్రాణరక్ష**

అనేకమంది కార్మికులు అవగాహన లేక, ఆర్థిక స్తోమత సరిపోక ఆరోగ్య పరీక్షలకు దూరంగా ఉంటున్నారు. ఈ అడ్డంకిని తొలగిస్తూ, జీహెచ్ఎంసీ నేరుగా వారి వద్దకే వైద్య సేవలను తీసుకెళ్తోంది.

* స్క్రీనింగ్ ఇలా: మొబైల్ వాహనాల్లోనే మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్ పరీక్షలు.. పురుషులకు ఓరల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
* లక్ష్యం: వ్యాధి ముదిరిన తర్వాత ఆందోళన చెందడం కంటే, ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించడం.

**పర్యవేక్షణలో రాజీ లేదు**

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్వయంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన సందర్శించి, సిబ్బందికి ధైర్యం చెప్పారు. ఇప్పటికే నగరంలోని 20 సర్కిళ్లలో విజయవంతంగా ఈ పరీక్షలు పూర్తి కావడం విశేషం.

* **అభిప్రాయాలు: "మా ఆరోగ్యంపై భరోసా పెరిగింది"**

**ప్రాథమిక దశలో గుర్తిస్తే మేలు**

"పారిశుద్ధ్య కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించి ఈ శిబిరం ఏర్పాటు చేయడం చాలా ప్రయోజనకరం.




వ్యాధిని మొదట్లోనే గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవడం సులభమని సిబ్బంది వివరిస్తున్నారు."

**-శైలజ, జూనియర్ సహాయకులు, హెల్త్ సెక్షన్**

**భయం పోయింది.. కృతజ్ఞతలు**

"క్యాన్సర్ అంటే మాకు చాలా భయం ఉండేది. కానీ ఇక్కడి వైద్యులు ఆ భయాన్ని పోగొట్టారు. పరీక్షలు చేయించుకున్నాం.. మా తోటి వారందరినీ చేయించుకోమని చెబుతున్నాం. మా ఆరోగ్యం కోసం ఈ చొరవ తీసుకున్న జీహెచ్ఎంసీకి కృతజ్ఞతలు."

**— జీ ప్రమీల, ఏ లక్ష్మమ్మ, పారిశుద్ధ్య కార్మికులు (మలక్‌పేట).**

# 'పుర' పోరులో హస్తం హవా.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం!

* **రాష్ట్రవ్యాప్త మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ ఘనవిజయం**
* **116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో మెజారిటీ స్థానాలు కైవసం**
* **ప్రచార కమిటీ వ్యూహాలకు, రేవంత్ నాయకత్వానికి ప్రజల పట్టాభిషేకం**



హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి): తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తం పార్టీ ప్రభంజనం సృష్టించింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను గెలుచుకోవడం ద్వారా తన ప్రజాదరణను మరోసారి నిరూపించుకుంది.

* **మధు యాష్కి వ్యూహమే శ్రీరామరక్ష!**

ఈ ఘనవిజయంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కి గౌడ్ కీలక పాత్ర పోషించారు. పార్టీ శ్రేణులను ఏకోన్ముఖం చేయడంలో, ప్రచార వ్యూహాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ఆయన అనుసరించిన పంథా సత్ఫలితాలను ఇచ్చింది.

**డిజిటల్ ప్రచారం:**

సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో ఆయన బృందం విజయవంతమైంది. సమగ్ర సమన్వయం: అభ్యర్థుల ఎంపిక నుంచి, చివరి నిమిషం వరకు ప్రచారంలో ఎక్కడా లోటు రాకుండా మధు యాష్కి పర్యవేక్షించడం పార్టీకి కలిసివచ్చింది. వ్యూహాత్మక అడుగులు: ప్రత్యర్థి పార్టీల విమర్శలను తిప్పికొడుతూనే, ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ సాగిన ఆయన ప్రచార శైలి పట్టణ ఓటర్లను విశేషంగా ఆకర్షించింది.

**పట్టణాల్లోనూ అదే జోరు:**

గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, ఇటీవల ముగిసిన సర్పంచ్ ఎన్నికల ఫలితాల పరంపరను కాంగ్రెస్ కొనసాగించింది. ముఖ్యంగా 90కి పైగా మున్సిపాలిటీల్లోనూ, నాలుగు ప్రధాన కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీని సాధించింది. విపక్షాల సవాళ్లను అధిగమించి, పట్టణ ఓటర్లు సైతం కాంగ్రెస్ వైపే మొగ్గు చూపడం విశేషం.

**సంక్షేమ ఫలాలకే పట్టం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఈ ఫలితాలు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గ్యారెంటీల అమలు, రైతుల రుణమాఫీ వంటి అంశాలు కాంగ్రెస్ విజయానికి ఊతమిచ్చాయి.

**విశ్లేషణాత్మక అంశాలు:**

గ్రామీణ పట్టణ అనుసంధానం: సర్పంచ్ ఎన్నికల విజయంతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించిన కాంగ్రెస్, ఇప్పుడు మున్సిపల్ విజయంతో పట్టణాల్లోనూ తిరుగులేదని నిరూపించింది. నాయకత్వ బలం: మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రచార సారథి మధు యాష్కి గౌడ్ సంయుక్త వ్యూహాలు అఖండ విజయాన్ని అందించాయి. విపక్షాల ప్రభావం: ప్రధాన ప్రతిపక్షాలు కొన్ని స్థానాలకే పరిమితం కావడంతో, రాష్ట్రవ్యాప్తంగా ఏకపక్ష పోరు కనిపించింది. ప్రజా తీర్పును గౌరవిస్తూ, ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఫిబ్రవరి 16న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తదనంతరం మున్సిపల్ చైర్మన్లు, మేయర్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది.

# బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడికి ఘన సన్మానం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 : భారతశక్తి: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన శ్రీ సుంకరి మల్లేశం గారిని పలువురు కార్మిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. నగరంలోని బీఎంఎస్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుంకరి మల్లేశం గారి అనుభవం, నాయకత్వం జాతీయ స్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో ఆయన మార్గదర్శకత్వం కీలకమని కొనియాడారు.




**పాల్గొన్న ముఖ్య నేతలు:**

ఈ సన్మాన కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర పారిశ్రామిక కార్యదర్శి శ్రీ రామ్మోహన్, సీనియర్ నాయకులు శ్రీ జయందర్, బీఎంఈయూ (BMEU) ప్రధాన కార్యదర్శి శ్రీ టి. కృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీ ఎం. రాధాకృష్ణ, అడిషనల్ జనరల్ సెక్రటరీ శ్రీ ఎస్. ప్రదుమన్ మరియు నాయకులు రూపేష్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# నుమాయిష్‌లో 'గ్రేటర్' ఘనత: జీహెచ్ఎంసీకి ఉత్తమ స్టాల్ అవార్డు!

* **మహిళా మణుల నైపుణ్యానికి దక్కిన పట్టం**
* **ఆకట్టుకున్న స్వయం సహాయక సంఘాల చేతివృత్తులు**
* **కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హర్షం.. అధికారులకు అభినందనలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి): నాంపల్లి ప్రదర్శన మైదానంలో కోలాహలంగా సాగుతున్న 'నుమాయిష్2026'లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) తన ప్రత్యేకతను చాటుకుంది. అట్టహాసంగా సాగిన ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని విభాగాలను తలదన్ని, జీహెచ్ఎంసీ స్టాల్ 'బెస్ట్ స్టాల్' పురస్కారాన్ని కైవసం చేసుకుంది. మహిళా సాధికారతకు నిలువుటద్దంగా నిలిచిన ఈ స్టాల్, వేలాది మంది సందర్శకుల మన్ననలు పొంది జయకేతనం ఎగురవేసింది.

* **ఆదర్శంగా నిలిచిన 35 మహిళా సంఘాలు**

జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో సుమారు 35 స్వయం సహాయక సంఘాలు తమ ప్రతిభను ప్రదర్శించాయి. మహిళలు స్వయంగా



చేతులతో తయారు చేసిన గృహోపకరణాలు, అలంకరణ వస్తువులు, చేనేత వస్త్రాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి. కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా, భారీ స్థాయిలో విక్రయాలు సాగించడం ఈ స్టాల్ ప్రత్యేకత.

**విజేతగా 'గ్రేటర్':**

స్టాల్ నిర్వహణ, ఉత్పత్తుల నాణ్యత, సందర్శకుల స్పందనను పరిగణనలోకి తీసుకున్న నుమాయిష్ నిర్వాహకులు, జీహెచ్ఎంసీకి ప్రశంసా పత్రాన్ని అందించారు. గోషామహల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ విజయలక్ష్మి ఈ మెమెంటోను, అవార్డును స్వీకరించారు.

**మహిళల కృషికే ఈ గౌరవం: కమిషనర్**


జీహెచ్ఎంసీకి ఉత్తమ స్టాల్ అవార్డు రావడం పట్ల కమిషనర్ ఆర్.వి. కర్ణన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "తమ ఉత్పత్తులను అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలో ఉంచి, అత్యుత్తమ ఫలితాలను సాధించిన స్వయం సహాయక సంఘాల మహిళలకు నా అభినందనలు. పట్టణ సామాజిక అభివృద్ధి అధికారుల కృషి వల్లే ఇది సాధ్యమైంది" అని కొనియాడారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇలాంటి మరిన్ని వేదికలను కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# భక్తులకు గుడ్‌న్యూస్.. శ్రీశైలం వచ్చే వాహనాలకు టోల్ మినహాయింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : మహాశివరాత్రి సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ముక్కంటి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది. శుక్రవారం (ఫిబ్రవరి 13) నుంచి 16 వరకు దేవస్థానం, అటవీశాఖ టోల్‌గేట్ల (నంద్యాల మార్గంలో) వద్ద ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని వెల్లడించింది. రాత్రివేళల్లోనూ రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపింది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 2,59,050 మంది భక్తులు దర్శనాలు చేసుకున్నారని నంద్యాల జిల్లా కలెక్టర్ తెలిపారు. మహా శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా అదనపు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

* **43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులు**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్ఆర్టీసీ (TGSRTC) అన్ని



ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపనున్నది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తున్నది.

# భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR)తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై ఆయన మీడియాతో మాట్లాడారు. "దాదాపు 700800 వార్డుల్లో గెలుస్తామని భావించాం. 15 మున్సిపాలిటీల్లో మేం స్పష్టంగా గెలిచాం. మరో 37 మున్సిపాలిటీల్లో మాకు మంచి ఫలితాలు వచ్చి.. హంగ్ పరిస్థితి ఉంది. మా కార్యకర్తలు వీరోచితంగా పోరాడారు. గద్వాలలో ఒక వార్డులో నాలుగు సార్లు రీకౌంటింగ్ నిర్వహించారు. వర్ధన్నపేటలో పలుమార్లు రీకౌంటింగ్ చేయడంతో అక్కడ మా కార్యకర్తలు ధర్నా చేస్తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు 2020లో మున్సిపల్ ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ 122, కాంగ్రెస్ 4, భాజపా, 2, ఎంఐఎం 2 చోట్ల గెలిచాయి. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 30శాతానికిపైగా వార్డులు గెలిచింది. మొత్తం మీద మంచి ఫలితాలు వచ్చినట్టు భావిస్తున్నాం. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ అధికారులను అడ్డంపెట్టుకుని విజయం సాధించింది.. డబ్బు, మద్యం పంపిణీ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడింది. అధికార పార్టీ ఎన్ని అక్రమాలు చేసినా.. ధైర్యంగా బీఆర్ఎస్‌కు ఓటు



వేసిన ప్రజలకు ధన్యవాదాలు. సింగరేణి బొగ్గు కుంభకోణం బయటపెట్టిన తర్వాత కేతన్‌పల్లి మున్సిపాలిటీలో సీపీఐ కూడా మాతో కలిసి వచ్చింది. దీంతో అక్కడ విజయం సాధించాం. హంగ్ ఏర్పడిన చోట.. ఛైర్మన్ పీఠాలు కైవసానికి కాంగ్రెస్ అప్పుడే బేరసారాలు, కొనుగోళ్లు మొదలు పెట్టింది. కాంగ్రెస్, భాజపా రెండూ కుమ్మక్కయ్యాయి. సింగరేణిలో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలంటే సీపీఐ మాతో కలిసి రావాలి. కాంగ్రెస్, భాజపాను ఎండగట్టేందుకు కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతిస్తాం. సీపీఐ నేత కూనంనేని సాంబశివరావుకు ఫోన్ చేసి ఇదే విషయం చెప్పా. కాంగ్రెస్, భాజపాను ఎదుర్కొనే శక్తి బీఆర్ఎస్‌కు మాత్రమే ఉందని, కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని ప్రజలు భావిస్తున్నారు. భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. కలిసొచ్చే తటస్థులను కలుపుకొని పోయేందుకు సిద్ధంగా ఉన్నాం.

**ప్రధాన ప్రతిపక్షంగా మేం సఫలమయ్యాం..**

అధికార పార్టీ సామ, దాన, భేద దండోపాయాలు ప్రయోగించినా ప్రజల మనసును గెలుచుకోలేకపోయింది. స్థానిక సంస్థల ఎన్నికలు సహజంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. ఇటీవల పంచాయతీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారు. బీఆర్ఎస్‌పై ఏదేదో మాట్లాడిన వారి నోళ్లు మూత పడేలా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి అంత నమ్మకం ఉంటే పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలి. ప్రధాన ప్రతిపక్షంగా మేము సఫలమయ్యాం, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతున్నాం. అందుకే ప్రజల నుంచి మాకు మద్దతు లభిస్తోంది. ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో ఈ ఎన్నికల ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది. అధికార పార్టీ 8090శాతం గెలిస్తేనే గెలుపు అవుతుంది. స్థానిక ఎన్నికలు కాబట్టే స్థానికంగానే ప్రచారం చేశాం. పనితీరు బాగా ఉంటే ప్రజలు ఆదరిస్తారు" అని కేటీఆర్ అన్నారు.

# 'సాక్షి' కథనంపై హెరిటేజ్ ఫుడ్స్ ఫైర్... ప్రకటన విడుదల

అమరావతి, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : తమ సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిషన్లలో నేడు (ఫిబ్రవరి 13న) "ముందు నెయ్యి.. వెనుక గొయ్యి.. హెరిటేజ్ కోసమే కుట్ర" అనే శీర్షికతో వచ్చిన వార్త పూర్తిగా అసత్యమని, దురుద్దేశపూరితమని, పరువు నష్టం కలిగించేలా ఉందని సంస్థ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర ఉందని, ఇది కేవలం తమ 33 ఏళ్ల బ్రాండ్ విలువను దెబ్బతీయడమే లక్ష్యంగా సాగుతున్న దుష్ప్రచారమని హెరిటేజ్ ఫుడ్స్ పేర్కొంది.

**ఇందాపూర్ డైరీతో సంబంధం లేదు**

ఈ కథనంలో పేర్కొన్నట్టుగా మహారాష్ట్రకు చెందిన ఇందాపూర్ డైరీతో హెరిటేజ్ ఫుడ్స్‌కు ఎలాంటి యాజమాన్య లేదా సంస్థాగత సంబంధం లేదని స్పష్టం చేసింది. ఇందాపూర్ డైరీ అనేది ఒక స్వతంత్ర ప్రైవేట్ సంస్థ అని, దాని యాజమాన్యం, నిర్వహణ, కార్యకలాపాలు పూర్తిగా వేరని వివరించింది. తమకు ఇందాపూర్ డైరీతో కేవలం పనీర్, చీజ్, యూహెచ్‌టీ మిల్క్, స్కిమ్డ్ మిల్క్ పౌడర్ (SMP) తయారీకి మాత్రమే కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ ఒప్పందం ఉందని, నెయ్యి తయారీకి గానీ, సరఫరాకు గానీ ఎలాంటి ఒప్పందం లేదని తేల్చిచెప్పింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు నెయ్యి సరఫరా చేసేందుకు ఇందాపూర్ డైరీతో తాము ఎన్నడూ ఒప్పందం చేసుకోలేదని తెలిపింది.

**రాజకీయ ప్రేరేపిత ఆరోపణలు**

20142019 మధ్య కాలంలో టీటీడీకి నెయ్యి సరఫరా చేసినట్లు తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని హెరిటేజ్ ఫుడ్స్ ఆవేదన వ్యక్తం చేసింది. ఇందాపూర్ డైరీతో పాటు మరో ఐదు డైరీలను సిండికేట్‌గా చూపిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. ఈ నిరాధార ఆరోపణలను వైసీపీ నాయకులు, ముఖ్యంగా భూమన కరుణాకర్ రెడ్డి వంటి వారు, సాక్షి మీడియా ద్వారా ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని హెరిటేజ్ ఆరోపించింది. ఇవి కేవలం రాజకీయ ప్రేరేపితమైనవని, కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే ప్రయత్నమని పేర్కొంది. గడచిన 33 సంవత్సరాలుగా రైతులు, వినియోగదారులకు నిజాయతీగా సేవలు అందిస్తున్న తమ సంస్థపై ఇలాంటి బురద జల్లడం దారుణమని తెలిపింది. ప్రజలు ఇలాంటి తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, వాస్తవాలను తెలుసుకునేందుకు తమ అధికారిక వెబ్‌సైట్ (heritagefoods.in)ను సందర్శించాలని హెరిటేజ్ ఫుడ్స్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంస్థ అధికారికంగా రిజాయిండర్ విడుదల చేసింది.

# హైదరాబాద్‌లో అక్రమ సరోగసీ రాకెట్... లేడీ డాక్టర్ ను అరెస్ట్ చేసిన ఈడీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన అక్రమ సరోగసీ రాకెట్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కీలక చర్యలు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించి మనీలాండరింగ్ ఆరోపణలపై డాక్టర్ అడుతూరు నమ్రత అలియాస్ పచ్చిపల్లి నమ్రతను శుక్రవారం అరెస్ట్ చేసింది. అనంతరం ఆమెను కోర్టులో హాజరుపరచగా, ఫిబ్రవరి 26 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ పేరుతో నమ్రత ఈ అక్రమ దందా నడిపినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. సంతానం లేని దంపతుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి, వారికి సరోగసీ ద్వారా బిడ్డను అందిస్తామని నమ్మించేవారు. అయితే, పేదరికంతో బిడ్డలను పెంచుకోలేని గర్భిణులను ఏజెంట్ల ద్వారా గుర్తించి, పుట్టిన వెంటనే శిశువులను కొనుగోలు చేసేవారని ఈడీ ఆరోపించింది. ఆడశిశువుకు రూ. 3.5 లక్షలు, మగశిశువుకు రూ. 4.5 లక్షలు చెల్లించి, వారిని సంతానం లేని దంపతులకు అమ్మేవారని దర్యాప్తులో వెల్లడైంది. ఈ రాకెట్‌పై గతంలోనే హైదరాబాద్ గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి అభియోగాలపై పలు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి.

# నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు: సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : పోలవరం నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం సమర్థనీయం కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులోంచి 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, పోలవరాన్ని వంశధారతో అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 20 నెలల్లో తమ సంకీర్ణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని వివరించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎదురైన ఇబ్బందులను అధిగమించిన తీరును, అభివృద్ధిని అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలను సభలో ప్రస్తావించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందుందని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు విశాఖకు వస్తున్నాయని చెప్పారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నం వద్ద రూ.70,000 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కచ్చితంగా నెరవేరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రజారోగ్య సేవలను మెరుగుపరిచేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొస్తున్నామని, ఇందులో భాగంగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. ఈ నెల 16న బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటనకు రానున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు.

# ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : హైదరాబాద్ నగరంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కుల స్థలాల కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

*** భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులకు విముక్తి**

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు కీలక ఆపరేషన్ చేపట్టారు. 1968లో వేసిన ఈ లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కాలక్రమేణా కబ్జాకు గురయ్యాయి. గతంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను 20 ఏళ్ల క్రితం తొలగించడంతో, అప్పటి నుంచి పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, నివాసితులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఒకేసారి 6 పార్కులలోని ఆక్రమణలను తొలగించి, 2260 గజాల స్థలానికి 'హైడ్రా ఫెన్సింగ్' వేసి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందంతో ర్యాలీలు తీసి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు.

*** గుడిమల్కాపూర్‌లో పార్కుకు విముక్తి**

ఇదే తరహాలో, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. గతంలో లోతట్టు ప్రాంతంగా ఉన్న ఈ 1,152 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, కొందరు వ్యక్తులు దానిని ఆక్రమించుకుని ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, కొబ్బరి బొండాల అమ్మకాలకు వినియోగిస్తున్నారు. 2018లో జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోవడంతో, స్థానికులు హైడ్రాను సంప్రదించారు. ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగా హైడ్రా అధికారులు కబ్జాదారులను ఖాళీ చేయించి, స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేశారు. ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో హైడ్రా తన నిబద్ధతను చాటుకుంటోందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# వరల్డ్ రేడియో డే... డిజిటల్ యుగంలోనూ ఉనికిని చాటుకుంటున్న రేడియో

ఢిల్లీ, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : సోషల్ మీడియా, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్‌ల యుగంలోనూ రేడియో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది. ఇవాళ (ఫిబ్రవరి 13) ప్రపంచ రేడియో దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈ మాధ్యమం ప్రాధాన్యం మరోసారి చర్చనీయాంశమైంది. 'రేడియో, కృత్రిమ మేధస్సు' (Radio and Artificial Intelligence) అనే ఈ ఏడాది థీమ్.. సంప్రదాయ ప్రసార మాధ్యమానికి, ఆధునిక సాంకేతికతకు మధ్య మారుతున్న సంబంధాన్ని స్పష్టం చేస్తోంది.తరతరాలుగా సమాచారం, విద్య, వినోదాన్ని అందించే శక్తివంతమైన మాధ్యమంగా రేడియో నిలిచింది. ఉదయాన్నే భక్తి గీతాల నుంచి వార్తా బులెటిన్లు, ఇంటరాక్టివ్ కార్యక్రమాల వరకు దేశంలోని ప్రతి ఇంట్లో ఇది ఒక నమ్మకమైన నేస్తంగా కొనసాగుతోంది. నేటికీ చిన్న చిన్న దుకాణాలు, ఆటోరిక్షాలు, పెట్రోల్ పంపులలో రేడియో శబ్దం వినిపిస్తూనే ఉండటం సమాజంలో దానికున్న ఆదరణకు నిదర్శనం. ముఖ్యంగా గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఆరోగ్యం, సైన్స్ వంటి కీలక సమాచారాన్ని అందించడంలో రేడియో విశ్వసనీయతను చాటుకుంటోంది. రేడియోకు మళ్లీ ప్రాచుర్యం కల్పించడంలో ప్రధాని నరేంద్ర మోదీ నెలవారీ కార్యక్రమం 'మన్ కీ బాత్' కీలక పాత్ర పోషించిందని చెప్పవచ్చు. ఈ కార్యక్రమం రేడియోను మళ్లీ జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువచ్చింది. కుటుంబాలు, సంఘాలు కలిసికట్టుగా రేడియో వినే సంస్కృతిని ప్రోత్సహించింది. 'పరీక్షా పే చర్చ' వంటి కార్యక్రమాలు యువ శ్రోతలను కూడా ఈ వేదికకు దగ్గర చేశాయి. ఆకాశవాణి హజారీబాగ్ కేంద్రానికి చెందిన అల్కా కుమారి, ప్రకాశ్ రాణా మాట్లాడుతూ.. రేడియో సులభంగా అందుబాటులో ఉండే మాధ్యమమని, ప్రజలతో అనుసంధానమై ఉందని తెలిపారు. 'కిసాన్ వాణి' కార్యక్రమంతో సంబంధం ఉన్న రాణా, రేడియో.. రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సైనికులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తోందని వివరించారు. ఇంటర్నెట్ రాకముందు దేశంలో భౌగోళిక దూరాలను చెరిపేయడంలో రేడియోనే అత్యంత ప్రభావవంతమైన సాధనంగా ఉండేదని ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్ రాజీవ్ కుమార్ గుర్తుచేశారు. 1946 ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభమైనందుకు గుర్తుగా, 2011లో యునెస్కో ఈ తేదీని ప్రపంచ రేడియో దినోత్సవంగా ప్రకటించింది. ఆ తర్వాత 2012లో ఐరాస సర్వసభ్య సమావేశం దీనిని ఆమోదించింది. కాలం, సాంకేతికత మారినా రేడియో ప్రాముఖ్యత చెక్కుచెదరలేదు. డిజిటల్ యుగంలోనూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు విశ్వసనీయమైన, ప్రభావవంతమైన మాధ్యమంగా రేడియో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాం

ఢిల్లీ, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. పాఠశాలలకు సంబంధించి శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. 2020 నుంచి 2026 వరకు ఆర్థిక సంవత్సరాల వారీగా మనబడి నాడునేడు, మనబడి మన భవిష్యత్ పథకాల కింద ఖర్చు చేసిన నిధుల వివరాలు, ఆయా పథకాల కింద పూర్తిగా అభివృద్ధి చేసిన, ఇంకా అభివృద్ధి చేయాల్సిన పాఠశాలల వివరాలపై సభ్యులు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, టి.కల్పలత, ఎంవీ రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం రూ.7,500 కోట్లు ఖర్చుపెట్టాల్సిన అవసరం ఉందని అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. అయితే ప్రతి పాఠశాలకు స్టార్ రేటింగ్ ఇవ్వాలని తాను సూచించానని అన్నారు. 18 అంశాలపై ఈ రేటింగ్ ఇచ్చి పలు అంశాలను గమనించామని అన్నారు. సుమారు 40 శాతం పాఠశాలలు 2 స్టార్ కంటే తక్కువగా ఉన్నాయని, వీటిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని అన్నారు. క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చాలా ముఖ్యమని అన్నారు. "నేను చిత్తూరు పర్యటకు వెళ్లినప్పుడు కొన్ని పాఠశాలల్లో లీక్ ప్రూఫ్ భవనాలు లేవు. పెయింటింగ్, కూర్చోవడానికి బెంచీలు, ఇతర మౌలిక సదుపాయాలు లేవు. ముందు లీక్ ప్రూవ్ బిల్డింగ్స్, బెంచీలు, పెయింటింగ్, ఫర్నిచర్, వాటర్, టాయిలెట్స్ అందించాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. పాఠశాలల్లో పెండింగ్ వర్క్స్ ఎక్కడ ఉన్నాయో మొత్తం సమీక్ష చేస్తున్నాం. జీవో 117కు ప్రత్యామ్నాయంగా మోడల్ ప్రైమరీ స్కూల్స్ కింద తరగతికో ఉపాధ్యాయుడు విధానాన్ని తీసుకువచ్చాం. గతంలో కేవలం 3 శాతం పాఠశాలల్లో తరగతికో ఉపాధ్యాయుడు ఉంటే ఇప్పుడు 33 శాతానికి తీసుకువచ్చాం. దీనివల్ల కొన్ని పాఠశాలల్లో ఎక్కువ తరగతి గదుల అవసరం ఉంది. వీటన్నింటిని పరిశీలించి మేం ముందుకు వెళ్తాం. గతంలో నాడు నేడు కింద అభివృద్ధి చేసిన 233 పాఠశాలలు మూసివేయడం జరిగింది. నిధులు అనవసరంగా వృధా చేయకూడదు. ఎక్కడ అవసరమో అక్కడ అభివృద్ధి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నాం. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ పైనా దృష్టి సారించాం. 2019 నంచి 2024 వరకు లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో వెనుకబడ్డాం" అని లోకేశ్ అన్నారు.

# ఎంపీపై అనర్హత వేటు ప్రొసీజర్ ఇదే!

ఢిల్లీ, ఫిబ్రవరి 13 (భారత శక్తి) :లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడుతోంది. అమెరికాతో కుదిరిన ట్రేడ్ డీల్ ను విమర్శిస్తూ.. దేశాన్ని అమెరికాకు అమ్మేశారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడాన్ని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె తీవ్రంగా పరిగణించారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. సభ నుంచి బహిష్కరించడంతో పాటు రాహుల్ గాంధీని జీవితకాలం పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని కోరారు. సభ్యత్వ రద్దు ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ లోక్ సభలో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో ఎంపీల సభ్యత్వాన్ని తొలగించే ప్రక్రియపై చర్చ జరుగుతోంది.

*** ఫిర్యాదు నోటీసులతో ప్రక్రియ ప్రారంభం..**

పార్లమెంట్ సభ్యుడికి వ్యతిరేకంగా సహచర సభ్యుడు లేదా పార్టీ అధికారికంగా ఫిర్యాదు చేయడంతో తొలగింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ఫిర్యాదు (నోటీసు)ను స్పీకర్ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేస్తారు. సభ్యుడిపై వచ్చిన ఆరోపణలపై కమిటీ విచారణ జరిపి స్పీకర్ కు నివేదిక సమర్పిస్తుంది. సదరు సభ్యుడిని దోషిగా తేల్చి, అతడిపై అనర్హత వేటు వేయాలని రికమెండ్ చేస్తే ఆ రిపోర్టును స్పీకర్ లోక్ సభలో చర్చకు పెడతారు. దీనికి మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపితే సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడుతుంది.

# మోదీ రాజకీయ భవిష్యత్తుపై ట్రంప్ వీడియో.. స్పందించిన భారత్

ఢిల్లీ, ఫిబ్రవరి 13 (భారత శక్తి) :"భారత ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ భవిష్యత్తు నాశనం చేయాలనుకోవడం లేదు" అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్పందించారు. ఆ వీడియోను తాను చూడలేదని అన్నారు. కానీ ఆ వీడియో ఉంటే కనుక అది నిజమో కాదో తెలుసుకుని అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆంక్షలు ఉన్న నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై గత ఏడాది భారత్ మీద ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో అధ్యక్షుడు ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీని గొప్ప వ్యక్తి అంటూ ప్రశంసించారు. అదే సమయంలో మోదీ రాజకీయ జీవితంపై ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ట్రంప్ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంపై ఆయన స్పందించారు.

**భారత్‌కు ఆహ్వానం అందింది**

గాజా పునర్నిర్మాణం కోసం ట్రంప్ ఏర్పాటు చేసిన 'శాంతి మండలి'లో చేరాలని ఆహ్వానం వచ్చిందని రణధీర్ జైశ్వాల్ తెలిపారు. ఈ ప్రతిపాదనపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఈ బోర్డుకు సంబంధించి ఫిబ్రవరి 19న జరిగే తొలి సమావేశానికి భారత్ హాజరవుతుందో లేదో ఆయన స్పష్టం చేయలేదు. అయితే పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాలకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని అన్నారు. గాజా సహా ఎక్కడైనా శాశ్వత శాంతికి మార్గం సుగమం చేసే అన్ని కార్యక్రమాలను ప్రధాని మోదీ స్వాగతించారని గుర్తు చేశారు.

# బలపడిన భారత పాస్‌పోర్ట్.. 75వ స్థానానికి జంప్

ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో భారత్ తన స్థానాన్ని గణనీయంగా మెరుగుపరచుకుంది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 75వ స్థానంలో నిలిచింది. గతేడాది 85వ స్థానంలో ఉన్న భారత్, ఈసారి ఏకంగా 10 స్థానాలు ఎగబాకడం విశేషం. ఈ తాజా ర్యాంకు ప్రకారం భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు ముందస్తు వీసా అవసరం లేకుండా 56 దేశాలకు ప్రయాణించే వీలుంది. అంతర్జాతీయంగా భారతీయులకు ప్రయాణ సౌలభ్యం పెరిగిందనడానికి ఈ మెరుగైన ర్యాంకే నిదర్శనం. అయితే, గతంతో పోలిస్తే భారత్ మెరుగైనప్పటికీ ఇది అత్యుత్తమ ర్యాంకు కాదు. 2006లో భారత్ 71వ స్థానాన్ని సాధించడమే ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన. 2024లో 80వ స్థానానికి, ఆ తర్వాత 85వ స్థానానికి పడిపోయిన భారత ర్యాంకు ఇప్పుడు తిరిగి పుంజుకుంది.

# బంగ్లాదేశ్ ఎన్నికల్లో బీఎన్‌పీ ఘన విజయం.. తారిక్ రహ్మాన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

ఢిల్లీ, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : బంగ్లాదేశ్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత తారిక్ రహ్మాన్‌కు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం బంగ్లాదేశ్ 13వ జాతీయ పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత జరిగిన తొలి ఎన్నికలు ఇవే. వెలువడుతున్న అనధికారిక ఫలితాల ప్రకారం 17 ఏళ్ల ప్రవాసం తర్వాత ఇటీవలే దేశానికి తిరిగి వచ్చిన తారిక్ రహ్మాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ పార్టీ 300 స్థానాల పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీని కైవసం చేసుకుంది.

# నాగర్ కర్నూల్ మునిసిపాలిటీపై ఎగిరిన కాంగ్రెస్ జెండా

* ఆరు స్థానాలకే పరిమితమైన కారు

నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలో మునిసిపాలిటీ ఎన్నికల ఫలితాలను శుక్రవారం జిల్లా కేంద్రంలో ఒక ప్రైవేటు పాఠశాలలో లెక్కించారు. మునిసిపాలిటీలోని 24 వార్డులలో 18 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి విజయ దుందుభి మోగించింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఆరు స్థానాలకే పరిమితమైంది ఎన్నికల ప్రచారంలో నువ్వా నేనా అనే స్థితిలో సాగిన ఫలితాలలో మాత్రం వార్ వన్ సైడ్ గా కొనసాగింది ఒకటవ వార్డు నుండి అర్జునయ్య 473 ఓట్ల ఆదిశంతో విజయం సాధించగా రెండవ వార్డు నుండి బి ఆర్ ఎస్ అభ్యర్థి తిమ్మాజీపేట పాండు 22 ఓట్ల ఆదిత్యంతో మూడవ వార్డు నుండి బి ఆర్ ఎస్ అభ్యర్థి కవిత 86 ఓట్లతో విజయం సాధించగా నాలుగవ వార్డు నుండి వసంత 419 ఓట్ల ఆదిత్యం సాధించారు ఐదవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరసింహ రెడ్డి 133 ఓట్ల ఆదిక్యాం సాధించగా ఆరవ వార్డు నుండి శ్రీనివాసులు 80 ఓట్ల ఆధిక్యం ఏడవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అలివేలమ్మ 134 ఓట్ల ఆధిక్యం సాధించారు. ఎనిమిదవ వార్డు నుండి బాదం రమేష్ 300 ఓట్ల ఆధిక్యం ప్రదర్శించగా 9 వ వార్డు నుండి అలివేల రాజేష్ గౌడ్ 315 ఓట్ల ఆదిక్యం కనబరిచారు. పదవ వార్డు నుండి బి ఆర్ ఎస్ జయప్రకాశ్ చారి 50 ఓట్ల ఆదిక్యాం సాధించగా 11 వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆసిఫా బేగం 148 ఓట్ల ఆధిక్యం కనపరిచారు 12వ వార్డు నుండి టిఆర్ఎస్ అభ్యర్థి జయలక్ష్మి నాగేష్ రెండు ఓట్ల తేడాతో విజయం సాధించారు 13వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా కొత్త గంగాధర్ 138 ఓట్ల ఆధిక్యం తో విజయం సాధించారు. 14వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా నాజిమా ఖాజా ఖాన్ 360 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించగా 15వ వార్డు నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గౌసియా బేగం 307 ఓట్ల ఆదిత్యం తో విజయం సాధించగా 16వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింధు 12 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 17వ వార్డు అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేశ్వరి 84 ఓట్ల ఆదిక్యాం తో విజయం సాధించగా 18 వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చంద్రకళ విజయం సాధించగా 19వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి సునీత గౌడ్ 157 ఓట్ల ఆదిక్యాం కనపరిచారు. 20వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మలిశెట్టి పద్మ 13 ఓట్ల తేడాతో విజయం సాధించగా 21 వ వార్డు నుండి పడిగే శంకర్ 42 ఓట్ల ఆధిక్యం కనబరిచారు. 22వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాధవి 240 ఓట్ల తేడాతో విజయం సాధించగా 23వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీగల సునీంద్ర 240 ఓట్ల ఆధిక్యాన్ని 24వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నిజాముద్దీన్ 310 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందించారు అనంతరం నాయకులు కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా కాలనీలో ర్యాలీ నిర్వహించారు








## ఘనంగా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో

# వార్షికోత్సవ వేడుకలు....

* విద్యతోనే సామాజిక గుర్తింపు....
* ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి....




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో శుక్రవారం నాడు కళాశాల వార్షికోత్సవ వేడుకలు విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు. ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి జి.వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి 100% ఫలితాలు సాధించాలని అన్నారు. ఈనెల 25 నుండి ఇంటర్మీడియట్ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యను ప్రతిష్టంగా గుర్తిస్తుందని వచ్చే సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు వస్త్రాలతో కూడిన కిట్టు ఇచ్చే యోచనాల్లో ఉన్నట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనం పరిశీలనలో ఉందన్నారు. అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవి మాట్లాడుతూ ఈకళాశాలలో చదివిన ప్రతి విద్యార్థి ఉన్నత స్థితికి చేరుటకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు కావాలని అన్నారు.ఉపాధి దిశగా విద్యనుఅభ్యసించాలన్నారు.విద్యతోనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం పరీక్షలలో అధికమార్కుల తెచ్చుకున్న విద్యార్థులకు పథకాలు అందజేశారు. విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం సామూహిక భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో లెక్చరర్లు ఈ.రవిప్రకాష్,హరిత, మహమ్మద్ యునూస్, మంజుల,రాజేశ్వర్,సత్యం,శిరీష,నరేందర్ గౌడ్, నాగరాజు,రాజశేఖర్,రాజేశ్వర్,హిఫ్స,రాజయ్, తుకారాం, సిద్ధికి, కిరణ్, కృష్ణయ్య, మంజుల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలో

## విద్యార్థులచే స్వయం పరిపాలన దినోత్సవం



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి , ఫిబ్రవరి 13 (భారత శక్తి) : నాగర్ కర్నూల్ నియోజకవర్గం బిజినపల్లి మండల పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు విద్యార్థులచే స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఇందులో జిల్లా కలెక్టర్ గా ఎండి సోహెల్, ఆర్డీడిగాడి. దీప్తి,అడిషనల్ కలెక్టర్ గా ఎన్.జ్యోతి, డీఈవోగా గీత ఎంఈఓగా శ్రేయ,పాఠశాల హెడ్మాస్టర్ గా తులసి బాధ్యతలు నిర్వహించారు.28 మంది ఉపాధ్యాయులుగా 8 మంది సిబ్బంది బాధ్యతలు నిర్వహించారు.విద్యార్థులు చక్కగా ఉపాధ్యాయులు మాదిరిగా తయారై తరగతి గదులలో చక్కటి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి పాఠ్యాంశాలను బోధించారు.విద్యార్థులు వాటిని శ్రద్ధగా విన్నారు. ఉపాధ్యాయులు నేటి విద్యార్థి ఉపాధ్యాయుల బోధనను పరిశీలించడం జరిగింది.ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం ద్వారా విద్యార్థులకు ఉపాధ్యాయుల యొక్క బాధ్యతలు తెలియడం కోసం భవిష్యత్తులో ఉపాధ్యాయులుగా రావడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జీ.మురళి మోహన్ చార్యులు అన్నారు.చక్కగా బోధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు హనుమంతు రెడ్డి,యాదగిరి రావు,చంద్రమోహన్ రెడ్డి, పరమేశ్వరయ్య, నూరుద్దీన్,కృష్ణకుమార్, వెంకటస్వామి,హుస్సేన్, నాగిరెడ్డి,సతీష్ రెడ్డి, శేఖర్,భవిత,జయలక్ష్మి, లక్ష్మీపతి,రాకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆక్రమణల చెర నుంచి పార్కులకు హైడ్రా అవియుక్తి

* ఒకే కాలనీలో ఆరు పార్కుల రక్షణ.. 3,712 గజాల స్వాధీనం
* విముక్తి పొందిన భూమి విలువ రూ. 37.12 కోట్లు
* హర్షం వ్యక్తం చేస్తూ కాలనీల్లో స్థానికుల సంబరాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : నగరంలో ప్రాణవాయువును అందించే ఊపిరితిత్తుల వంటి పార్కులపై కబ్జాదారుల కన్ను పడితే 'హైడ్రా' (HYDRAA) సహించే ప్రసక్తే లేదని మరోసారి నిరూపితమైంది. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై మెరుపు వేగంతోస్పందించిన అధికారులు.. శుక్రవారం ఒకేరోజు వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 3,712 గజాల పార్కు స్థలాలకు విముక్తి కల్పించారు. వీటి బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ. 37.12 కోట్లు ఉంటుందని అంచనా. కబ్జాల చెర వీడటంతో స్థానిక నివాసితులు పెద్ద ఎత్తున వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు.

* భాగ్యలక్ష్మి కాలనీలో 'ఆరు' పార్కుల రక్షణ





మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం సుభాష్ నగర్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో 1968లో 80 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. ఇందులో 10 పార్కులను కేటాయించారు. అయితే, అప్పట్లో ఈ లేఅవుట్ మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా కొన్ని పార్కులు ఆ లైన్ల కిందకు వచ్చాయి. సుమారు 20 ఏళ్ల క్రితం ఆ విద్యుత్ లైన్లను తొలగించడంతో, ఖాళీగా ఉన్న పార్కు స్థలాలపై ఆక్రమణదారుల కన్ను పడింది. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన అధికారులు.. వరుసగా ఉన్న 6 పార్కులను గుర్తించారు. శుక్రవారం అక్కడ అక్రమ నిర్మాణాలను తొలగించి, 2,260 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేసి తమ బోర్డులను ఏర్పాటు చేశారు.

* గుడిమల్కాపూర్‌లో 1,452 గజాల స్వాధీనం

అసిఫ్ నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో 1,500 గజాల పార్కు స్థలం ఏళ్ల తరబడి కబ్జాదారుల చేతుల్లో బందీ అయింది. ఒకప్పుడు గుంతగా ఉన్న ఈ స్థలాన్ని పూడ్చివేసిన కొందరు వ్యక్తులు.. అక్కడ ఇసుక వ్యాపారం, వాహనాల పార్కింగ్, కొబ్బరిబొండాల విక్రయాలు సాగిస్తున్నారు. 2018 నుంచి స్థానికులు పోరాటం చేస్తున్నా ఫలితం లేకపోయింది. హైడ్రా రంగంలోకి దిగి రికార్డులను పరిశీలించగా అది పార్కు స్థలమేనని తేలింది. దీంతో శుక్రవారం అక్కడ 1,452 గజాల స్థలానికి విముక్తి కల్పించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

* హైడ్రాకు జేజేలు.. కాలనీల్లో పండగ వాతావరణం

దశాబ్దాల నాటి సమస్యలు ఒక్క రోజులో పరిష్కారం కావడంతో స్థానిక కాలనీల్లో పండగ వాతావరణం నెలకొంది. కబ్జాల తొలగింపు అనంతరం స్థానికులు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. హైడ్రా ఏర్పాటు చేసిన బోర్డుల వద్ద సెల్ఫీలు దిగుతూ, ప్రభుత్వానికి మరియు అధికారులకు అనుకూలంగా నినాదాలు చేశారు.

# అభివృద్ధికి చిరునామా.. నవజీవన్ రెడ్డి

* రాఘువేంద్ర కాలనీ వాసుల ఘన సన్మానం



హయత్ నగర్, ఫిబ్రవరి 13 (భారతశక్తి) : నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసిన తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డికి రాఘవేంద్ర కాలనీ వాసులు నీరాజనం పట్టారు. తమ కాలనీ అభివృద్ధికి గత ఐదేళ్లుగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు.

**మారిన కాలనీ రూపురేఖలు:**

ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ.. నవజీవన్ రెడ్డి హయాంలో రాఘవేంద్ర కాలనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని కొనియాడారు.

* ప్రధానంగా: మౌలిక సదుపాయాలు: అత్యాధునిక సీసీ రోడ్ల నిర్మాణం, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో కాలనీ రూపురేఖలు మారాయి.
* ప్రజా సంక్షేమం: తాగునీటి ఎద్దడి లేకుండా చూడటంతో పాటు, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణలో ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.
* అందుబాటులో నాయకత్వం: ఏ చిన్న సమస్య వచ్చినా ఫోన్ చేయగానే స్పందించి, అధికారులతో సమన్వయం చేస్తూ పరిష్కరించే 'ప్రజా మనిషి' అని ప్రశంసించారు.

**ప్రజల ప్రేమే నా బలం - నవజీవన్ రెడ్డి:**

* సన్మానానంతరం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తనపై చూపిన నమ్మకం, ప్రేమాభిమానాలే తనను ముందుకు నడిపిస్తున్నాయని అన్నారు.
* పదవిలో ఉన్నా లేకున్నా రఘవేంద్ర కాలనీ అభివృద్ధి కోసం, ఇక్కడి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

**సందడిగా సన్మాన కార్యక్రమం:**

* ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, సీనియర్ సిటిజన్స్, మహిళా సంఘం ప్రతినిధులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నల్గొండ అంటే కాంగ్రెస్ అని మరోసారి రుజువు చేశారు

**: మంత్రి కోమటిరెడ్డి**

నల్గొండ, ఫిబ్రవరి 13 (భారత శక్తి) : నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక విజయం సాధించడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు అఖండ మెజారిటీని కట్టబెట్టిన నల్గొండ ప్రజలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా, నల్గొండ పట్టణాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా పాలనకు ఈ గెలుపు నిదర్శనమని అన్నారు. నల్గొండలో మొత్తం 48 వార్డులకు గాను కాంగ్రెస్ కు 27, బీఆర్ఎస్ కు 9, బీజేపీకి 4, ఇతరులకు 8 స్థానాలు దక్కాయి. ఈ విజయం ద్వారా "నల్గొండ అంటే కాంగ్రెస్... కాంగ్రెస్ అంటే నల్గొండ" అని ప్రజలు మరోసారి రుజువు చేశారని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థులందరికీ ఆయన అభినందనలు తెలిపారు. గెలుపొందిన కార్పొరేటర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో, ఓటమి పాలైన అభ్యర్థులు నిరుత్సాహపడకుండా, తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ఎజెండా అని స్పష్టం చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.